



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారు

- వివరాలు 3 లో..



## గొడ్డలి పట్టే వారికి

# రైతుల బాధలు గుర్తొస్తాయా?

- పక్క రాష్ట్రాలకూ గొడ్డలి పార్టీ నేరాలు
- తెలంగాణలోనూ దందాలు సాగుతున్నాయి
- ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల ఆస్తులు కొట్టేశారు
- నేరాలు-ఘోరాలు చేసి ఎదుటి వాళ్లపైనా వేసేస్తారు
- అయినా ఆ మాజీ ఎమ్మెల్యేను సస్పెన్షన్ చేయరు
- ఉద్యోగాలు ఇస్తుంటే బురదజల్లే ప్రయత్నాలూ చేస్తున్నారు
- ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి
- 2027 నాటికి భూ రికార్డులు పూర్తి ప్రక్షాళన
- కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు
- మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాం తంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. రాష్ట్రంలో భూ రికార్డులను 2027 నాటికి ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీని ప్రస్తావిస్తూ నేరాలు, ఘోరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుంది. ఆ పార్టీ దందాలు ఇతర రాష్ట్రాలకూ పాకుతున్నాయి.. తెలంగాణ లో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేసి రూ.1500 కోట్ల ఆస్తిని కొట్టేశారు. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఆ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతుల బాధలు గుర్తుకురావు..కోడి కత్తి డ్రామాలు ఆడే వారికి వరికోతలు ఎలా తెలుస్తాయని వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చే వారికి పంటల సాగు గురించి ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందు కువెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని వ్యాఖ్యానించారు.

2



# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం

- 8 మంది మృతి, పలువురికి గాయాలు
- సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- అత్యుత్తమ వైద్యసేవలకు ఆదేశం
- ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం
- మృతులు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటన
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన హెూంమంత్రి

4

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులకు స్టీల్ ప్లాంట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించాలని ఆదేశించారు. ఘటనపై ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించారు.

## సీఎస్, కలెక్టర్‌తో సీఎం సమీక్ష

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సీఎస్ సాయిప్రసాద్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రమాదంలో 8 మంది చనిపోగా గాయపడిన ఆరుగురిలో ఇద్దరి పరిస్థితి విషమం ఉందని కలెక్టర్ సీఎంకు వివరించారు. చనిపోయిన వారిలో ఐదుగురు పర్మినెంట్, ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించినట్లు చెప్పారు. కాగా ఘటనపై కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.



# అభిమానికి ఆత్మీయ పలకరింపు



### సత్యనారాయణను కలిసిన సీఎం చంద్రబాబు

### ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం

తనను చూడాలనుకుంటున్న పెద్దాయన కోరికను ముఖ్య మంత్రి చంద్రబాబు తీర్చారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారా యణను సోమవారం సిద్ధాంతంలో కలుసుకున్నారు. స్వయంగా తన బస్సులోకి పిలిపించుకుని కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. కుటుంబ వివరాలు ఆరా తీశారు. కుమారుడికి వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చారు. సత్యనారాయణకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

3

# నేటి తిరుపతి సభ వాయిదా

### సీఎం చంద్రబాబు నిర్ణయం

తిరుపతిలో మంగళవారం నిర్వహించాల్సిన కూటమి బహిరం గ సభ వాయిదా పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'సంక్షేమం' పేరిట భారీ విజయోత్సవ సభను నిర్వహించాలని కూటమి నేతలు నిర్ణయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం చోటు చేసుకోవడంతో కూటమి నాయ కులతో మాట్లాడి సీఎం చంద్రబాబు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

3

## నామినేషన్లు దాఖలు చేసిన

# టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు

తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ సోమవారం ఏపీ అసెం బ్లీ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామి నేషన్ పత్రాలు దాఖలు చేశారు. అంతకుముందు టీడీపీ కేంద్ర కార్యాలయంలో వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, తంగిరాల సౌమ్య, పంతం నానాజీ, శ్రీరాం తాతయ్య, బోలిశెట్టి శ్రీనివాస్, బూర్ల రామాంజనేయులు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

5






# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

- రికార్డుల పూర్తి ప్రక్షాళనకు మూడేళ్ల సమయం
- కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు
- తెలంగాణలోనూ గొడ్డలి పార్టీ దందాలు సాగుతున్నాయి
- సంతకాలు ఫోర్జరీ చేసి రూ.1500కోట్ల ఆస్తులు కొట్టేశారు
- నేరం చేసిన ఆ పార్టీ నేతను అయినా సస్పెన్షన్ చేయరు
- గొడ్డలి పట్టే వారికి.. నాగలి పట్టే రైతుల బాధలు గుర్తుకురావు
- నేరాలు-ఘోరాలు చేసి ఎదుటి వాళ్లపైనా వేసేస్తారు
- రాజముద్రతో పట్టాలిస్తుంటే.. దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు
- ఉద్యోగాలు ఇస్తుంటే బురదజల్లే ప్రయత్నాలూ చేస్తున్నారు
- ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి
- మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆచంట(చైతన్యరథం): రాష్ట్రంలో భూ రికార్డులను 2027ంనాటికి ప్రక్షాళనచేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమగోదావరి జిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంలో మీ భూమి - మీ హక్కు కార్యక్రమంలో ఆయన పాల్గొని రాజముద్రతో కూడినపట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దుచేసి యాజమాన్య హక్కులను రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు



పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు మూడేళ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్‌కు శాశ్వతమైన బ్లాక్‌చైన్ ఐడీలు ఇస్తున్నామని..దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫొటోలు ముద్రించుకున్నారని.. పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తున్నామని... ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్‌డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే తొమ్మిది నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ పుస్తకం ఉంటుందని స్పష్టం చేశారు.

## రెవెన్యూ శాఖలో సమూల మార్పులు

రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని... రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని సీఎం వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100శాతం ఆటో మ్యూటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని వివరించారు. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. 80శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్‌ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22ఏ నుంచి తప్పించామని తెలిపారు.

తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. అక్వా రైతులకు అండగా నిలబడ్డామని స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరిచారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టంచేశారు. అక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు.పశ్చిమగోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసిటికల్ ఔషధాల తయారుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

## రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం..అభివృద్ధి

కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్లపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడుప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అభివృద్ధిని ట్రాక్‌లో పెట్టామని.. పెట్టుబడులు ఉద్యోగాల కల్పన జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలుచేస్తున్నాం అని వివరించారు. సూపర్‌సిక్స్‌లో చెప్పిన వాటి కంటే అదనంగా ఇచ్చామని తెలిపారు. పెన్షన్,తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని వివరించారు.

## గొడ్డలి పార్టీది ఓర్వలేనితనం

డీఎస్సీ ద్వారా దాదాపుగా 16వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని.. పరీక్షలు అంటే తెలియని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఉద్యోగాలు ఇచ్చి జాబ్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే నేరాలు ఘోరాలుచేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గొడ్డలిపార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని... నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకూ మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇచ్చారు.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలుచేసే అర్హత ఆపార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రజలను,నిరుద్యోగులను గొడ్డలిపార్టీ నేతలు క్షమాపణలు కోరాలి.. ప్రజలను క్షమాపణ కోరకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హతలేదని అన్నారు. ప్రజలకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నందుకు సంతోషిస్తున్నా..కానీ వైసీపీ పార్టీ నేతలు రాష్ట్రంలో భూ కబ్జాలు చేశారని రికార్డులు తారుమారు చేశారు. తెలంగాణా రాష్ట్రానికి వెళ్లి అక్కడి తహసీల్దారు, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేశారు. ఈనేరంలో రూ.1500కోట్ల అక్రమాలు జరిగాయి. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు.. వినుకొండ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలిపట్టే రైతులు గుర్తుకురారని.. కోడి కత్తి డ్రామాలు ఆడే వారికి వరి కోతలు ఎలా తెలుస్తాయని సీఎం వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చే వారికి పంటల సాగు గురించి ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకువెళ్లాలం టే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని వ్యాఖ్యానించారు.

## అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర

అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించటంలో కృషిచేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15లోగానే రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు వివరించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందు బాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.ప్రతీఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2047 సంపన్నమైన, ఆనందకరమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయటమే లక్ష్యమని వివరించారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోకో ద్వారా తయారైన చాక్లెట్లను, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తుల ప్రదర్శనలను పరిశీలించారు. వరి ఊక, గడ్డి ద్వారా తయారైన వివిధ ఉత్పత్తులు, గుర్రపు డెక్క ద్వారా తయారైన వర్మీ కంపోస్టును సీఎం పరిశీలించారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీదారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానా యుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# అభిమానికి ఆత్మీయ పలకరింపు

**సత్యనారాయణను కలిసిన సీఎం చంద్రబాబు - ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం**





ఆచంట(చైతన్యరథం):ఎప్పటి నుంచో తనను చూడాలనుకుంటున్న ఓ అభిమాని కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామ ధేనువు లంకగ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడు చంద్రబాబుకు వీరాభిమాని. తమ నియోజకవర్గానికి వస్తున్నారని,దూరం నుంచైనా ఆయన్ను చూడాలని మాట్లాడిన వీడియోవైరల్ కాగా సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లిన విషయం తెలిసిందే. సత్యనారాయణ గారూ సిద్ధాంతంలో కలుద్దాం అని సీఎం రిప్లై కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మీ భూమి-మీ హక్కు కార్యక్రమం లో పాల్గొనేందుకు సిద్దాంతంవెళ్లిన చంద్రబాబు.. కార్యక్రమం అనంతరం తన బస్సులోకి సత్య నారాయణను ప్రత్యేకంగా పిలి పించుకుని కాసేపు ఆత్మీయంగా మాట్లాడారు. కుటుంబ వివరాలు, ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తన కుమారుడు అనారోగ్యంతో బాధ పడుతున్నాడని, అతనికి వైద్యసాయం అందించా లని సత్యనారాయణ కోరారు. తమ గ్రామానికి డ్రైనేజ్ సదుపాయం కల్పించాలని విన్నవించా రు. కుమారుడికి వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చారు. సత్యనారాయణకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

# రీ సర్వేలో సమస్యల పరిష్కారం


**ఆనందం వ్యక్తం చేసిన రైతులు - ముఖాముఖిలో చంద్రబాబుకు కృతజ్ఞతలు**



ఆచంట(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం సిద్ధాంతంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన దివాకర శ్రీనివాసులు, నాగలక్ష్మి అనే రైతు కుటుంబంతో ముచ్చ టించి వారి పొలాన్ని పరిశీలించారు. గతంలో తమ భూమి ఇనాం భూమిగా నమోదైందన్న విషయం తమకు తెలియదని సీఎంకు దివాకర దంపతులు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీ సర్వే ప్రక్రియ ద్వారా సమస్య పరిష్కారమైందని ముఖ్యమంత్రికి తెలిపారు. అనంతరం మామిడిసెట్టి సాయి సుబ్రహ్మణ్యం అనే రైతుతో సీఎం ముఖాముఖి అయ్యారు. తన పౌల్ట్రీ వ్యాపారం గురించి వివరించి రీ సర్వే ప్రక్రియ గురించి తన అభిప్రాయాన్ని సుబ్రహ్మణ్యం పంచుకున్నారు. ఇక రీ సర్వేలో సమస్య పరిష్కారం పొందిన రైతులతో సీఎం సమావేశమయ్యారు. 2023లో ఇనాం ఖాతాలు ఫ్రీ హోల్డ్ భూములుగా మార్చడంతో ఇబ్బందులు పడ్డా మని రైతులు సీఎంకు వివరించారు. దీంతో వ్యవసాయ రుణాలు పొందడానికి, విక్రయాలు జరుపుకోవడానికి, రిజిస్ట్రేషన్‌కు తీవ్ర ఇబ్బందులు పడ్డామని చెప్పారు. రైతుల అభిప్రాయాలు తెలుసు కున్న తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి పట్టాదారు పుస్తకా లు అందించి గ్రూప్ ఫోటో దిగారు.







**తిరుపతి విజయోత్సవ సభ వాయిదా**

## సీఎం చంద్రబాబు నిర్ణయం

తిరుపతి(చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదంతో తిరుపతిలో మంగళవారం నిర్వహించాల్సిన కూటమి సభను వాయిదా వేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేర కు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం'పేరిట భారీవిజ యోత్సవ సభనునిర్వహించాలని కూటమినేతలు నిర్ణయించారు. ఈసభకు సీఎం చంద్రబాబు,పవన్‌కల్యాణ్‌తో సహా కూటమి నేత లంతా భారీగా హాజరుకావాల్సి ఉంది. అయితే సోమవారం విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో భారీ ప్రమాదం చోటుచేసుకోవడం.. ఇలాంటి సమయంలో విజయోత్సవ సభ పెట్టడం సరికాదని నిర్ణయించుకుని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## ప్రజల హృదయాల్లో శాశ్వతం రామోజీరావు

**ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి**



అమరావతి(చైతన్యరథం): తెలుగు ప్రజలు గర్వించే మీడియా సంస్థలను అందించిన రామోజీరావు స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. రామోజీరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. "తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, మీడియా రంగంలో ఓ యుగకర్త, అక్షర యోధుడు రామోజీరావుకు నివాళులు. సామాన్య కుటుంబం నుంచి అసామాన్య శిఖరాలను అధిరోహించి మీడియాను ప్రజా చైతన్యానికి వేదికగా మలచిన ఆయన సేవలు చిరస్మర ణీయం. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్యసాహసాలతో నడిచిన ఆయన ప్రస్థానం తరతరాలకు స్ఫూర్తి. పత్రికా రంగ మంటే వ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత అని భావించి, ఆచరించి చూపించిన ఆదర్శవాది. ఆయన స్థానం ప్రజల హృదయాల్లో శాశ్వతం. ఆయన కీర్తి అజరామరమని పోస్టు చేశారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ: లోకేష్**

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు వర్ధంతి సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో నివాళులర్పించారు. స్వయం కృషితో అత్యున్నత స్థాయికి చేరి తెలుగుజాతికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన దార్శనికుడు రామోజీరావు. పారిశ్రామికవేత్తగా, పత్రికా సంపాదకుడిగా, స్టూడియో వ్యవస్థాపకునిగా, సినీ నిర్మాతగా పలు రంగాలలో తనదైన ముద్ర వేశారు. ఈనాడు పత్రిక ద్వారా ప్రజల జీవితాల్లో చైతన్య వెలుగులు నింపారని గుర్తు చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

## సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారు

**రేపు ఎన్డీయే పక్షాల భేటీకి హాజరు**

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ఖరారైంది. జూన్ 10, 11 తేదీల్లో ఆయన ఢిల్లీలో పర్యటించనున్నారు. జూన్ 10న విజయవాడ నుంచి సీఎం చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. భారత్ మండపంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగే ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన పాల్గొనున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. అదేరోజు రాత్రి న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో సీఎం చంద్రబాబు బస చేయనున్నారు. ఆ మరునాడు జూన్ 11వ తేదీన నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశా నికి ఆయన హాజరవుతారు. భారత్ మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ నీతి ఆయోగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి విజయవాడకు బయలుదేరనున్నారు. రాత్రికి ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

చైతన్యరథం

# నెల్లూరు యాత్రికుల బస్సుకు ప్రమాదం

- బాధితులకు సాయం అందేలా చూడాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- మృతుల కుటుంబాలకు సానుభూతి



అమరావతి(చైతన్యరథం): బీహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన కాశీ యాత్ర టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. నెల్లూరు జిల్లా నుంచి 46 మంది యాత్రికులతో కాశీ వెళ్లిన ఈ బస్సు ఔరంగా బాద్ వద్ద మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని సీఎంకు అధి, కారులు తెలిపారు. ఈదుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా 15 మందికి గాయాలయ్యాయని వివరించారు. బీహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బాధితులకు సాయం అందేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ప్రమాదం నుంచి బయటపడిన యాత్రికులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు బిహార్ ఉన్నతాధికారులతో పాటు అక్కడి స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో ఏపీ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను గయాలోని అనుగ్రహ నారాయణ మగధ్ మెడికల్ కాలేజ్-హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులంతా క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. యాత్రికులను స్వస్థలాలకు చేర్చే అంశంపై బిహార్ ప్రభుత్వంతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

# విశ్రాంత ఆర్చ్ బిషప్ మృతికి సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం



అమరావతి(చైతన్యరథం): విశాఖకు చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తం చేశారు. మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని వ్యాఖ్యానించారు. కడప, విజయవాడ, విశాఖపట్నంలో బిషప్ గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు మరువ లేనివని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థి స్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మల్లవరపు మృతి బాధాకరం: లోకేష్**

విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్ బిషప్ ప్రకాశ్ మల్లవరపు మృతికి మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన తుదిశ్వాస విడవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. విద్యా వంతుడిగా, ఆధ్యాత్మిక వేత్తగా ఆయన తన జీవితాన్ని క్రైస్తవ సమాజ సేవకు అంకితం చేశారని కొనియాడారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు దయాసిస్ అపోస్టోలిక్ అడ్మి నిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలి టన్ ఆర్చ్ బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా విశిష్ట సేవలు అందిం చారని స్మరించుకున్నారు. ఆయన సేవలు కేవలం చర్చి పరిమి తుల్లోనే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తి గా నిలిచాయని పేర్కొన్నారు. ఆదర్శవంతమైన జీవనశైలి, వినయం, ప్రేమాభిమానాలతో పేదల సంక్షేమానికి కృషి చేసిన బిషప్‌గా చిరస్మరణీయులుగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ.. కుటుం బసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం



- 8 మంది మృతి, పలువురికి గాయాలు
- సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి
- అత్యుత్తమ వైద్యసేవలకు ఆదేశం
- ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం
- మృతులు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటన
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి

విశాఖపట్నం(చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 8 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. క్షతగాత్రులకు స్టీల్ ప్లాంట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరగనున్నట్లు తెలుస్తోంది. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో మోల్టెన్ మెటల్ (ద్రవ లోహం) తరలిస్తున్న ల్యాడిల్‌కు సంబంధించిన బకెట్లు కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న 1500డిగ్రీల వేడితో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణనష్టం వాటిల్లింది.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**



ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవే దన వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయా లని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించా లని ఆదేశించారు. కాగా ప్రమాదం ఎలా జరిగింది? భద్రతా ప్రమాణాల్లో ఏవైనా లోపాలుఉన్నాయా? సాంకేతిక కారణాల వల్లే ప్రమాదం సంభవించిందా? అనే అంశాలపై అధికారులు దర్యాప్తుప్రారంభించారు.పూర్తి వివరాలు అధికారిక నివేదిక వెలువడిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై మోదీ సంతాపం**



విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన భారీ ప్రమా దంపై ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు అవసరమైన తక్షణ సహాయాన్ని స్థానిక అధికారులు అందజేస్తారని తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయక నిధి నుంచి రూ.2 లక్షల పరిహారాన్ని మోదీ ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50, 000 సాయం అందజేస్తామని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు లోకేష్ సంతాపం**



విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం బాధాకరమని మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం,ప్రమాద స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోందని తెలిపారు.

**మెరుగైన వైద్యం అందించాలి: హోంమంత్రి అనిత**

ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగా త్రులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం పర్యటనలో ఉన్నప్పటి కీ ప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి హోంమంత్రి బయలుదేరారు.





చైతన్యరథం

# టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు







## రాజ్యసభకు టీడీపీ అభ్యర్థులుగా సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్

అమరావతి (చైతన్య రథం): రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లు సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముగ్గురూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్ వనితారాణికి తమ నామినేషన్లు అందజేశారు. ఈ ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. సానా సతీష్ రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా, చీఫ్ విప్ మరియు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, పంతం వెంకటేశ్వరరావు (నానాజి), తంగిరాల సౌమ్యలు ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. బాష్యం రామకృష్ణ రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బి. రామాంజనేయులు, కొలిశెట్టి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్యలు ప్రతిపాదకులయ్యారు.

చింతకాయల విజయ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుందరపు విజయ్‌కుమార్, బోడే ప్రసాద్‌లు ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం అఖిల్ కుమార్, పి విజయకుమారితోపాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), వరుపుల సత్యప్రభ, బండారు సత్యానందరావు, 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంక దినకర్ తదితర నేతలు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు ప్రమాదం రాష్ట్రానికి షాక్

**- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: పల్లా**

సమగ్ర దర్యాప్తు, స్వతంత్ర భద్రతా తనిఖీ నిర్వహించాలని డిమాండ్

విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో సోమవారం చోటుచేసుకున్న దారుణమైన పారిశ్రామిక ప్రమాదం రాష్ట్రానికి పెద్ద షాక్ అని, ప్రమాదం తీవ్ర దుఃఖాన్ని కలిగిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు తన హార్దిక సంతాపం తెలిపారు. స్టీల్ మెల్టింగ్ షాప్-2 (ఎస్ఎంఎస్-2) విభాగంలో లాడిల్ పేలుడుతో కరిగిన ఉక్కు లీకై జరిగిన ప్రమాదం పారిశ్రామిక నగరమంతటా విషాద ఛాయలు కప్పిందన్నారు. తమ కుటుంబాల భవిష్యత్తు కోసం శ్రమిస్తూ ప్రాణాలు పోగొట్టుకున్న కార్మికుల నష్టం అత్యంత వేదనాభరితమైనదన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, బాధిత కార్మికులకు అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం, వైద్యబృందాలు, ఉక్కు కర్మాగారం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందిస్తున్నారని వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనకు తక్షణమే స్పందించి అధికారులకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మృతుల కుటుంబాలకు సమగ్ర సహాయం అందించేందుకు, గాయపడిన వారికి అత్యాధునిక చికిత్స అందించేందుకు ప్రభుత్వం స్పష్టమైన నిర్దేశాలు జారీ



చేసిందని అన్నారు. ఈ కష్ట సమయంలో ప్రభుత్వం, పార్టీ కార్యకర్తలు బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తారని హామీ ఇచ్చారు.

**కార్మికుల భద్రత అత్యంత ప్రాధాన్యం**

ఏ పరిస్థితుల్లోనూ కార్మికుల భద్రతపై రాజీ పడకూడదని నొక్కిచెప్పిన పల్లా శ్రీనివాసరావు, ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించేందుకు సమగ్ర సాంకేతిక దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా వాస్తవాలు వెలుగులోకి తెచ్చి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సరిదిద్దే చర్యలు సూచించాలని కోరారు. భారీ పరిశ్రమలన్నింటిలో భద్రతా నిబంధనలపై ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఈ విషాదం ప్రస్తుత భద్రతా చర్యలను సమగ్రంగా సమీక్షించి అవసరమైన సంస్కరణలు అమలు చేయాల్సిన ఆవశ్యకతను స్పష్టంగా చాటిందన్నారు. పారిశ్రామికాభివృద్ధి ఎల్లప్పుడూ కార్యాలయ భద్రతలో రాజీలేని ప్రమాణాలతో కూడి ఉండాలని స్పష్టం చేశారు.

**ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఆకాంక్షల ప్రతీక**

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కేవలం ఒక పారిశ్రామిక సంస్థ మాత్రమే కాదని, అది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు, త్యాగాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకమని పల్లా శ్రీనివాసరావు అన్నారు. వేల కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన ఈ కర్మాగారం దాని స్థాపన కోసం జరిగిన సమిష్టి పోరాటానికి నిదర్శనంగా నిలుస్తోందని తెలిపారు.

తరతరాల కార్మికుల కఠోర శ్రమ, అంకితభావం, త్యాగాలతో ఉక్కు కర్మాగారం ఈ స్థాయికి ఎదిగిందని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి వారి సేవ అమూల్యమైనదని, దాన్ని ఎల్లప్పుడూ కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంటామని అన్నారు.

మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకుని సురక్షితంగా తమ కుటుంబాల వద్దకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ, ఈ విషాదం నుండి కోలుకునేందుకు వారికి అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# భారతీయ అద్భుత వరం యోగా

- **పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**
- **కారాగారంలో యోగాంధ్రకు హాజరు**

రాజమహేంద్రవరం(చైతన్యరథం): భారతదేశానికి అనాదిగా లభించిన గొప్ప వరం యోగా అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 'యోగాంధ్ర- 2026' కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఉదయం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ శ్రీమతి మేఘా స్వరూప్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్, అధికారులు కలిసి యోగా శిక్షకుల ఆధ్వర్యంలో విభిన్న ఆసనాలు వేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా భాగం చేసుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాం తత, క్రమశిక్షణ లభిస్తాయన్నారు. ఒత్తిడిని జయించడానికి యోగా ఒక్కటే మార్గమని ప్రపంచమంతా గుర్తిస్తోందని పేర్కొన్నా రు. ఇటీవల కేరళలో 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు తీసుకున్న సందర్భంలో అక్కడ వెల్‌నెస్ సెంటర్ల ప్రాధాన్యతను గమనించానని గుర్తుచేశారు. యోగా, ఆయుర్వేదాల వల్లే అక్కడ పర్యాటకం బాగా వృద్ధి చెందింది, విదేశీయులు కూడా ఆసక్తి చూపుతున్నారు. అదే తరహాలో ఏపీలోని 1058 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరంలో పెద్ద ఎత్తున వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పర్యాటకులను ఆకర్షించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోం దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కారాగార అధికారులు, సిబ్బంది మరియు ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అత్యంత క్రమశిక్షణతో యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో పాల్గొన్న వారందరికీ మంత్రి దుర్గేష్ అభినందనలు తెలియజేశారు.



చైతన్యరథం

# వైసీపీది రాక్షస పాలన
# కూటమిది వికాస పాలన

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఉద్ఘాటన**



నంద్యాల (చైతన్య రథం): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై నంద్యాలలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనతో గత ఐదేళ్లు రాక్షస పాలన సాగిందని, నేడు కూటమి ప్రభుత్వంలో వికాస పాలన అందుతోందని స్పష్టం చేశారు. ప్రజలు ఆ అరాచక పాలనను తిరస్కరించి కూటమికి 164 సీట్లు కట్టబెట్టారని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలు నెరవేరుస్తున్నామని, సూపర్ సిక్స్ అమలు అసాధ్యమని ప్రతిపక్షాలు అంటే అమలు చేసి చూపించామని జనార్దన్ రెడ్డి చెప్పారు. పింఛన్ 3,000 నుండి 4,000 రూపాయలకు పెంచామని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని తెలిపారు. గతంలో 'తల్లికి వందనం' పథకం ఇద్దరు పిల్లలకే పరిమితమని చెప్పి ఆడపడుచులను మోసం చేశారని విమర్శించారు. నేడు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం అందిస్తున్నామని, రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల విషయంలో గత ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. గ్రామాల్లో కనీసం తట్టెడు మట్టి పోసిన పాపాన పోలే దని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో దాదాపు 4,000 కిలోమీటర్ల సీసీ రహదారులు నిర్మించిందని, ఆర్ అండ్ బీ శాఖను 6 నెలల్లో 27,000 కిలో మీటర్ల రహదారులను గుంతల రహితంగా తీర్చిదిద్దిందని చెప్పారు. మొత్తం రూ.3,000 కోట్లతో రహదారుల అభివృద్ధి కొనసాగుతోందని వివరించారు. పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టాక వాటిని తిరిగి పట్టాలెక్కించారని తెలిపారు.

వైసీపీ నేత నిజాయితీని తీవ్రంగా ప్రశ్నించిన మంత్రి, సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లు అడుగుతామని చెప్పి అమలు చేయకుండా ఎలా ఓట్లు కోరారని నిలదీశారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటో వేయించుకున్న వైనాన్ని ఎండగట్టారు. నేడు కూటమి ప్రభుత్వంలో రాజముద్రతో పారదర్శకంగా పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.

ఉద్యోగాల విషయంలో 16,000 డీఎస్సీ పోస్టులు, 6,000 కానిస్టేబుల్ ఉద్యోగాలు అందించామని చెప్పారు. త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల కానున్న తరుణంలో ప్రతిపక్షం దుష్ప్రచారం మొదలుపెట్టిందని విమర్శించారు. పోలవరం పక్కనపెట్టి, అమరావతిని నిర్మూలించిన వైసీపీతో భిన్నంగా కూటమి ప్రభుత్వం రాయలసీమలో గోరకల్లు లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించిందని, అలగునూరు ప్రాజెక్టు తాము పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ('సర') విషయంలో ప్రజలు, ఓటర్లు, నేతలు, కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఓట్లు తొలగించడానికి, దొంగ ఓట్లు నమోదు చేయడానికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నంద్యాల జిల్లా అభివృద్ధికి ఆర్థిక శాఖ మంత్రి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని మంత్రి జనార్దన్ రెడ్డి ప్రశంసించారు.



# నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు!

**- ఈదురుగాలులు, పిడుగుల విషయంలో అప్రమత్తం**

**- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**

విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో మంగళవారం పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడకూడదని ప్రజలను హెచ్చరించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షపు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటికి వీలైనంత దూరంగా ఉండాలని హెచ్చరించారు.

మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, పోలవరం, ఏలూరు జిల్లాల్లో 42-43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో 40-42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం నెల్లూరు జిల్లా గూడూరులో 41.7, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 41.4, అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో 41.2, కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 41 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలుగా నమోదయ్యాయని పేర్కొన్నారు.

# 'సర్'పై అవగాహన పెంచుకోవాలి

**- వైసీపీ కుట్రలపట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- పార్టీ శ్రేణులకు మంత్రి డోలా పిలుపు**



ప్రకాశం / టంగుటూరు (చైతన్య రథం): కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్)పై క్షేత్రస్థాయిలో టీడీపీ శ్రేణులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కోరారు. సోమవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం ఐటీసీ కార్యాలయం వద్ద కొండపి నియోజకవర్గ టీడీపీ బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు సర్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి మంత్రి డోలా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగింపునకు గురికాకుండా జాగ్రత్తపడాలని, బూత్ స్థాయిలో ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. మన ఓట్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం మన బాధ్యతన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఓట్లు తొలగించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని, వైసీపీ కుట్రలపట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త ఓట్లు చేర్చడంతోపాటు ఉన్న ఓట్లు తొలగింపునకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడాలి

**● డీఎస్సీ సక్సెస్‌పై వైసీపీ అబద్ధాల ఫ్యాక్టరీ**

**● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆగ్రహం**



మంగళగిరి (చైతన్య రథం): డీఎస్సీ సక్సెస్‌పై వైసీపీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో విమర్శలకు హద్దులు, హుందాతనం ఉండాలని, తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ వ్యక్తిగత దూషణలకు పాల్పడలేదని, విధానాలపైనే రాజకీయ పోరాటం చేసిందని అన్నారు. ప్రతీకారం, విధ్వంసం, అసత్య ప్రచారాలు అనే పునాదులపైనే వైసీపీ రాజకీయాలు నిర్మితమయ్యాయని ఆయన దుయ్యబట్టారు. 2019-2024 వరకు రాష్ట్రంలో కొత్త ఉద్యోగ అవకాశాల కల్పన పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. ప్రతి జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి, నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క జాబ్ క్యాలెండర్‌గానీ, ఒక్క డీఎస్సీగానీ విడుదల చేయలేదని తప్పుబట్టారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన పరిశ్రమలను వైసీపీ ప్రభుత్వం తరిమివేసిందని, ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు రెండూ లేక యువత ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని ఆవేదన వ్యక్తం చేశారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఉద్యోగాల కోసం వేలాది వినతులు వచ్చాయని గుర్తుచేశారు. నిరుద్యోగ యువత అభ్యర్థన మేరకు కుప్పం వేదికగా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. డీఎస్సీని అడ్డుకునేందుకు వందకు పైగా కోర్టు కేసులు దాఖలైనా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని అన్నారు. నారా లోకేష్ పర్యవేక్షణలో డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, ఎంపిక ప్రక్రియ మొత్తం సాంకేతికత ఆధారంగా సాగిందని, ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేశారని వెల్లడించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించారని తెలిపారు. ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థ సాధించిన విజయానికి నిదర్శనమని అన్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఆయన, ఇప్పటికీ స్పోర్ట్స్ కోటాలో 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తుచేశారు. అవినీతి జరిగి ఉంటే ఆ పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంచుతారని ప్రశ్నించారు. ఈ అంశంలో వైసీపీ నేతలు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మేము అధికారంలోకి వస్తే డీఎస్సీని రద్దు చేస్తాం" అని వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు నిరుద్యోగ యువత ఆశలపై దాడి వంటివని మండిపడ్డారు. 16 వేల మంది యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా నియామకాలు చేపట్టిందని, ఎంపికైన అభ్యర్థుల హక్కులను కాపాడేందుకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ యువతలో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలను వైసీపీ వెంటనే మానుకోవాలని హెచ్చరించారు.

చైతన్యరథం

# ఎందుకంత ఏడుపు?

- **వైసీపీ వైఖరిపై భగ్గుమన్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి**
- **కూటమిపై కక్షతో అసత్య ప్రచారాలకు పాల్పడతారా?**
- **డీఎస్సీ సక్సెస్‌పై వైసీపీది అబద్ధాల ఫ్యాక్టరీ**
- **కూన రవికుమార్, భరత్‌లపై ఆరోపణలు నిరూపించాలని సవాల్**



మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో మెగా డీఎస్సీ 2025 ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ముగిసి, నిరుద్యోగుల ఇళ్లల్లో వెలుగులు నిండుతుంటే, ఆ విజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలకు తెరలేపారని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా వైసీపీ అబద్ధాల ఫ్యాక్టరీని నడుపుతోందని దుయ్యబట్టారు. "సర్టిఫికెట్ వెరిఫికేషన్" అంటే ఏమిటో కూడా తెలియని అజ్ఞానంలో వైసీపీ నేతలు ఉన్నారని రాంగోపాల్ రెడ్డి ఎద్దేవా చేశారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థులు జతచేసిన పత్రాలను తనిఖీ చేయడమే వెరిఫికేషన్ ప్రక్రియ అని, కాల్ లెటర్లు పంపినంత మాత్రాన ఉద్యోగాలు ఖరారైనట్లు కాదనే కనీస పరిజ్ఞానం కూడా ప్రతిపక్షానికి లేకపోవడం శోచనీయమన్నారు. స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థులు బోధన చేయలేరంటూ వైసీపీ చేస్తున్న వ్యాఖ్యలు క్రీడాకారులను తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులకు టెట్, బీఈడ్ అర్హతలు తప్పనిసరని, కేవలం పీఈటీ పోస్టులకు మాత్రమే నిబంధనల ప్రకారం మినహాయింపులు ఉన్నాయని స్పష్టం చేశారు. కూనా రవికుమార్, భరత్‌లపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని రాంగోపాల్ రెడ్డి సూటిగా సవాల్ విసిరారు. వారు ఫెడరేషన్ అధ్యక్షులుగా ఉన్న కాలంలో అక్రమాలు జరిగాయన్న ప్రచారంలో రవ్వంతైనా నిజం లేదన్నారు. గతంలో పథకాలు సాధించిన క్రీడాకారుల కాలక్రమ వివరాలను (2008, 2012, 2021, 2022 నాటి విజయాలు) సాక్ష్యాలతో సహా ఉదాహరిస్తూ వైసీపీ అవాస్తవాలను తిప్పికొట్టారు. స్పోర్ట్స్ కోటాలో టెట్ పాస్ కాకుండా ఎక్కడైనా స్కూల్ అసిస్టెంట్ లేదా ఎస్‌జీటీ ఉద్యోగాలు ఇప్పించినట్లు నిరూపిస్తే తాము తక్షణమే రాజీనామాలకు సిద్ధమని హెచ్చరించారు. వైసీపీ నేతలకు దమ్ముంటే ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని రాంగోపాల్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. డీఎస్సీలో ఎక్కడైనా ఒక్క రూపాయి చేతులు మారినా, సూచరాతలు, కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్ జరిగినట్లు నిరూపించినా తాము దేనికైనా సిద్ధమన్నారు. "మీ తాడేపల్లి సెంటర్‌లో అయినా, విజయవాడ బెంజ్ సర్కిల్‌లో అయినా, కడప కోటి సర్కిల్‌లో అయినా, కర్నూలు కొండారెడ్డి బుర్జు దగ్గరయినా... ఆఖరికి మీ ఇడుపులపాయ ప్యాలెస్‌లో అయినా సరే చర్చకు సిద్ధం. మీరు ఒక్కరు వస్తే ఒక్కరం వస్తాం, 10 మంది వస్తే 10 మంది వస్తాం. డేట్, టైం మీరే చెప్పండి" అంటూ సవాల్ విసిరారు. ఈ చర్చకు సంబంధించిన వేదిక, సమయాన్ని ఖరారు చేయడానికి వీలుగా 9490122964, 9111555111 నెంబర్లను మీడియా ముఖంగా ప్రకటిస్తూ, వీటికి మెసేజ్ పంపాలని స్పష్టం చేశారు. గత తిరుపతి సమావేశంలోనే ఈ సవాల్ విసిరామని గుర్తుచేశారు. వైసీపీ నుండి ఎవరు వస్తే వారికి సమానమైన క్యాడర్ నేతలను పంపుతామన్నారు. వైసీపీ అధ్యక్షుడు వస్తే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వస్తారని, వారి ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్సీలు వస్తే తాము కూడా అదే స్థాయి నేతలను పంపుతామని, ఆఖరికి బూత్ ఇంచార్జ్ స్థాయిలోనైనా చర్చకు సిద్ధమని తేల్చిచెప్పారు. గత వైసీపీ హయాంలో ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ పోటీల్లో కేవలం పాల్గొన్న వారికే దొంగ సర్టిఫికెట్లతో సచివాలయ ఉద్యోగాలు కట్టబెట్టిన అప్రజాస్వామిక చరిత్ర వారిదని రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం భారత క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటిన నిజమైన క్రీడాకారులకే అవకాశాలు కల్పించిందని వివరించారు. గతంలో బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయ బదిలీల్లో రూ.50 కోట్లు చేతులు మారిన వైనాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడపలో గ్రూప్-1 ఉద్యోగాల వ్యవస్థను సర్వనాశనం చేశారని, అదే టీడీపీ హయాంలో 11 డీఎస్సీలు జరిగితే ఒక్క ఆరోపణ కూడా రాలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా, యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలను మెరిట్ ప్రాతిపదికన చేపట్టి విద్యారంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఒకటవ తారీఖున జాబ్ క్యాలెండర్ ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన జగన్ రెడ్డి మాటలను యువత నమ్మే పరిస్థితి లేదన్నారు. కష్టపడి, ఒకపూట తిని తినక చదివి ఉద్యోగాలు సాధించి విధుల్లో చేరిన 16 వేల మంది పేద బడుగు, బలహీన వర్గాల పిల్లలను, వారి కుటుంబాలను వైసీపీ నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం భయభ్రాంతులకు గురిచేయడం తగదని హితవు పలికారు. డీఎస్సీ ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని, ప్రతిభావంతులైన అభ్యర్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం 100 శాతం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## బీహార్ ప్రమాద బాధిత కుటుంబాలకు
# ప్రభుత్వం అండగా ఉంటుంది





**దేవాదాయ మంత్రి ఆనం భరోసా**

ఆత్మకూరు (చైతన్య రథం): బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు యాత్రికులు మృతి చెందడంపై మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం మండలం నుండి 43మంది యాత్రికులతో గయా, వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురవడం విషాదకరమని ఆయన పేర్కొన్నారు. సంగం మండలానికి చెందిన ఇద్దరు, నెల్లూరు నగరానికి చెందిన ఒకరు మృతి చెందారు.

మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి ఆనం, గాయపడిన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైన యాత్రికుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధితులకు సహాయం అందించడంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని అధికార యంత్రాంగానికి సూచించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# భూదోపిడీ, మోసాలపై అర్జీల పోటు

- **టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్**
- **రూ.1.50 కోట్ల మోసం నుండి సైనికుని పట్టా భూమి కబ్జా వరకు..**
- **న్యాయం కోసం నేతల ముందు మొర**

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వచ్చిన పౌరులు భూదోపిడీ, మోసాలు, ఆక్రమణలపై తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎక్సైజ్-గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ మరియు జాతీయ అధికార ప్రతినిధి ఎన్. విజయ్ కుమార్ అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రూ. 1.50 కోట్లు స్వాహా.. మాజీ ఎమ్మెల్యే పేరుతో బెదిరింపులు

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన సూరపనేని పద్మారాణి తమ పొలం అమ్మిన డబ్బుతో మరో భూమి కొనాలని మధ్యవర్తుల ద్వారా ప్రయత్నించగా తీవ్రంగా మోసపోయినట్లు వెల్లడించారు. పామర్రు రాయల్ రెస్టారెంట్ సమీపంలో పొలం ఇప్పిస్తామని నమ్మించిన నవుడు శ్రీలక్ష్మి, కలకోటి రామిరెడ్డిలు తన ఇంటి వద్ద రూ. 1,50,00,000 నగదు తీసుకున్నారు. అగ్రిమెంట్ చేయకుండా కాలయాపన చేసిన వారు చివరకు ఆ డబ్బుతోనే ఆ పొలాన్ని రామిరెడ్డి పేరున రిజిస్టర్ చేయించుకున్నారు. పంచాయితీలో రూ. 1.12 కోట్లకు ప్రామిసరీ నోట్లు ఇచ్చినా మిగిలిన రూ. 38 లక్షలు ఇప్పటికీ చెల్లించలేదు. న్యాయస్థానం తమకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో వారు రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్ సాయంతో కుటుంబాన్ని కిడ్నాప్ చేస్తామని బెదిరిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ ఫొటోలు చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పద్మారాణి ఆరోపించారు.

**మాజీ ఎమ్మెల్యే అండతో తుగ్గలిలో భూదోపిడీ**

కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన చిన్న అంజినయ్య, చిరంజీవి, నెట్టికంటయ్యలు తమ సోదరుడు మేఘన్న అనే వ్యక్తి గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అండచూసుకుని తమ 5.52 ఎకరాల భూమిని మోసంగా స్వాధీనం చేసుకున్నాడని తెలిపారు. తప్పుడు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు సృష్టించి తల్లి పేరున ఉన్న భూమిని తన పేరుకు మార్చించుకున్నాడని, దీనికి స్థానిక రెవెన్యూ అధికారులు భారీ లంచాలు తీసుకుని సహకరించారని ఆరోపించారు. ఆదోని సివిల్ కోర్టులో కేసు నడుస్తుండగానే రెవెన్యూ రికార్డులు మార్చడం తీవ్రమైన చట్ట ఉల్లంఘన అని పేర్కొన్నారు.

**ఓటు వేయలేదని కక్ష -పట్టాభూమిపై ఆక్రమణ**

అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన వీర ప్రతాప్ తదితరులు తాము టీడీపీ సానుభూతిపరులు కావడం, గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయలేదనే కక్షతో స్థానిక వైసీపీ నేత రావూరి రమేష్ తమ చట్టబద్ధమైన పట్టాభూములను, పక్కనున్న ప్రభుత్వ మిగులు భూమిని ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నాడని ఆరోపించారు. స్థానిక వీఆర్వో సైతం వైసీపీ నేత వైపే నిలబడి తమ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు.

**డాక్యుమెంట్లు దోచుకుని భూమి కాజేత**

పల్నాడు జిల్లాకు చెందిన సుశీల తన తల్లిదండ్రులు 2009లో తన పేరున రిజిస్టర్ చేసిన ఇంటి స్థలం, 4.33 ఎకరాల భూమిని వదిన కుమారుడు కొడవళ్లు-కత్తులతో బెదిరించి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను బలవంతంగా అపహరించాడని తెలిపారు. అనంతరం స్థానిక వీఆర్వో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ పొలాన్ని వారి పేరుకు



మార్చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

**మాజీ సైనికుని పట్టాభూమి అక్రమ నమోదు**

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన దావీదు రాజు తన తండ్రి 75వ రెజిమెంట్‌లో సేవలందించిన మాజీ సైనికుడని, ఆయనకు మంజూరైన 2.50 ఎకరాల 'డి ఫారం' పట్టా భూమిని 2001లో రికార్డుల్లో అన్యాయంగా తొలగించి వేరొకరి పేరు నమోదు చేశారని వెల్లడించారు. న్యాయం కోసం వేడుకున్నా పట్టించుకోని మనస్తాపంతో 2004లో తండ్రి కన్నుమూశారని, నేటికీ న్యాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇవే కాకుండా అన్నమయ్య, సత్యసాయి, పార్వతీపురంమన్యం జిల్లాల నుండి వచ్చిన పలువురు భూ రికార్డుల మార్పు, రెవెన్యూ అధికారుల అక్రమాలు, ఆక్రమణలపై అర్జీలు సమర్పించారు. పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాలు, ఆరోగ్య సహాయం, ఉద్యోగాల కోసమూ పలువురు నేతలను కలిసి విజ్ఞప్తులు అందజేశారు. సమస్యలన్నింటిపై సత్వర చర్యలు తీసుకుంటామని నేతలు హామీ ఇచ్చారు.

చైతన్యరథం

### కళ్లముందే కలుషితమవుతుంటే

# ఇన్ని రోజులూ ఏం చేశారు?

- గోదావరి పరిస్థితిపై అధికారులకు డిప్యూటీ సీఎం ప్రశ్న
- పీసీబీ అందించిన ల్యాబ్ రిపోర్టుపై సమీక్ష సమావేశం
- పరిమితులను మించి ఎక్కువగా కాలుష్య కారకాలు గుర్తింపు
- ఆంధ్ర పేపర్ మిల్లు, రాజమండ్రి ఎంసీకి నోటీసులకు ఆదేశాలు
- నిర్లక్ష్యం వహించిన పీసీబీ అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): పవిత్ర గోదావరి నదిని పారిశ్రామిక రసాయనాలు, నగర మురుగునీరు ఎంత దారుణంగా కలుషితం చేస్తున్నాయో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు అందించిన ల్యాబ్ రిపోర్టుల్లో వెలుగు చూశాయి. గత నెల మే 25న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా బోటుపై వెళ్లి నల్లా ఛానల్, ఆంధ్ర పేపర్ మిల్లు లగూన్స్ (మడుగులు) వద్ద సేకరింపజేసిన నీటి నమూనాల పరీక్షా ఫలితాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. అత్యాధునిక సాంకేతికతతో జరిపిన ఈ పరీక్షలలో, అనుమతించదగిన పరిమితుల కంటే కాలుష్య కారకాలు అధిక రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ నివేదికపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సోమవారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.

గోదావరి నదిని మురుగుమయం, రసాయనమయం చేస్తున్న ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, కళ్ల ముందే గోదావరి నది ఇంతలా కలుషితమవుతున్నా, ఇన్ని రోజులుగా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎందుకు కాలయాపన చేశారని అధికారులను ప్రశ్నించారు. అధికారులు చట్టపరంగా వారు చేయాల్సిన విధులను ఎందుకు నిర్వర్తించకుండా నిర్లక్ష్యం చేశారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

**ఆందోళనకర స్థాయిలో కోలిఫామ్ బ్యాక్టీరియా**

భక్తులు ఎంతో పవిత్రంగా భావించే రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్, నల్లా ఛానల్ పరిసరాల్లో గోదావరి నది నీరు మురుగునీటివల్ల తీవ్రంగా కలుషితమైందని ల్యాబ్ పరీక్షల్లో తేలింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు ఇక్కడ నీటి నమూనాలను సేకరించి పరీక్షించగా ఆందోళనకరమైన నిజాలు బయటపడ్డాయి. సాధారణంగా నది నీటిలో మనుషులు స్నానాలు చేయడానికి కోలిఫామ్ బ్యాక్టీరియా సంఖ్య పరిమితికి మించి ఉంది. నీటిలో కాలుష్యాన్ని చూపే బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పరిమితి కూడా అధికంగా ఉంది. దీనివల్ల నీటిలో ఆక్సిజన్ తగ్గిపోయి చేపలు, జలచరాలు చనిపోతున్నాయి. నీటి స్వచ్ఛత గరిష్ఠంగా 5 ఎన్‌టీయు పాయింట్లుండాలి. కానీ పరీక్షల్లో ఇది 8.4 నుండి 14.2 ఎన్‌టీయు వరకు వచ్చింది. మురుగునీరు కలవడంవల్ల గోదావరి నీరు పూర్తిగా రంగుమారిపోతోంది. మురుగు కాలువలో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పరిమితి 250 ఎంజి/ఎల్ దాటకూడదు. కానీ ఇక్కడ 263గా నమోదైంది. రసాయన ఎరువుల అవశేషాలు, ఫ్యాక్టరీల వ్యర్థాలు కలవడంవల్లే నైట్రేట్లు ఇంతగా పెరిగాయి. ఈ ల్యాబ్ నివేదిక ప్రకారం ఈ నీరు స్నానాలు చేయడానికి గానీ, గృహ అవసరాలకు గానీ ఏమాత్రం పనికిరాదు. ఈ నీటివల్ల కలరా, టైఫాయిడ్, విరేచనాలు, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా నైట్రేట్లు ఎక్కువగా ఉండటంవల్ల చిన్న పిల్లలకు ఆక్సిజన్ అందక బ్లూ బేబీ సిండ్రోమ్ అనే వ్యాధి వచ్చే ముప్పు ఉందని నివేదిక హెచ్చరించింది.

**తప్పులు సరిచేసుకోవడానికి మరో అవకాశం**

ఆంధ్ర పేపర్ మిల్లు పరిసరాల్లోని లగూన్ వ్యర్థ జలాల ల్యాబ్ నివేదికలో కాలుష్య తీవ్రత నిర్ధారణ అయింది. చట్టప్రకారం ఈ నివేదిక ఆధారంగా సదరు ఫ్యాక్టరీని తక్షణమే మూసివేయడానికి, ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయడానికి, అలాగే భారీగా జరిమానా విధించడానికి ప్రభుత్వానికి పూర్తి అధికారాలు ఉన్నాయి. అయినప్పటికీ, పవన్ కళ్యాణ్ పరిశ్రమల మనుగడను, కార్మికుల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో ఆ పరిశ్రమకు మరొక అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. తక్షణమే తప్పులను సరిదిద్దుకునేందుకు మరో అవకాశం ఇచ్చారు. పరిశ్రమలను మూసివేసి కార్మికులను రోడ్డున పడేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, పర్యావరణ నిబంధనలను పాటిస్తూ నదిని కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆంధ్ర పేపర్ మిల్లు యాజమాన్యం తమ వ్యర్థ నీటి శుద్ధి ప్లాంట్ పనితీరును తక్షణమే మెరుగుపరచుకోవాలని, ల్యాబ్ నివేదికలో తేలిన లోపాలను యుద్ధప్రాతిపదికన సరిచేసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆంధ్ర పేపర్ మిల్లు, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజమండ్రి పీసీబీ అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు.

**డీపీఆర్ సిద్ధం చేయండి**

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఒక్క చుక్క మురుగునీరు కూడా శుద్ధి కాకుండా గోదావరిలోకి వెళ్లకూడదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎంత మురుగునీరు వస్తోంది? భవిష్యత్తులో జనాభా పెరిగితే ఎంత వస్తుంది? అనే అంశాలపై పూర్తి సర్వే చేయాలి. మురుగునీటిని శుద్ధి చేయడానికి ఎన్ని ప్లాంట్లు అవసరమవుతాయి? ఎంత ఖర్చు అవుతుంది? సమగ్ర ప్రాజెక్టు నివేదికను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి ప్రక్షాళనకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వం సహాయం కోసం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడతానని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి. కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ ఎస్. శరవణన్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై నేతల తీవ్ర దిగ్భ్రాంతి

**-బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ**



అమరావతి (చైతన్య రథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో 8మంది కార్మికులు మృతి చెందడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉక్కు ద్రవం లీకై పలువురు కార్మికులు గాయపడడం బాధాకరమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని విజ్ఞప్తి చేసిన ఆయన, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. కార్మికుల ప్రాణభద్రతకు యాజమాన్యం అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాద ఘటనలో పలువురు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సహాయక చర్యలను ముమ్మరం చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రమాద ఘటనపై అధికారులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

- సాంకేతిక సంస్కరణలతో దేశానికే ఆదర్శం
- ఏపీ సివిల్ సప్లయిస్‌పై మంత్రి నాదెండ్ల ప్రశంసలు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో సివిల్ సప్లైస్ శాఖ గత రెండేళ్లలో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పాత్రికేయులతో మాట్లాడిన ఆయన, రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు.

ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారని, గత రెండేళ్లలో రూ.30,361 కోట్ల విలువైన కొనుగోళ్లు నిర్వహించి సకాలంలో చెల్లింపులు చేశారని తెలిపారు. 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలినవి కూడా 48 గంటలు దాటకుండా పూర్తి చేశారని పేర్కొన్నారు.

సాంకేతిక సంస్కరణలలో భాగంగా దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు-విక్రయ విధానాన్ని అమలు చేశారని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానం ద్వారా 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించారని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్ల విలువైన టార్పాలిన్లు ఉచితంగా పంపిణీ చేశారని చెప్పారు. "దీపం-2" పథకం ద్వారా రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లకు సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో వరుసగా 97.36 లక్షలు, 93.83 లక్షలు, 94.81 లక్షలు, 92.28 లక్షల సిలిండర్లకు రూ.764, రూ.777, రూ.791, రూ.760 కోట్ల సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని వెల్లడించారు. ఐదో విడతకు ఇప్పటికే రూ.300 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేసినట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల కుటుంబాలకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారని, వన్ నేషన్-వన్ రేషన్ కార్డు విధానంలో ఏ రేషన్ దుకాణంలోనైనా సరుకులు పొందే వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు 16.88 లక్షల మందికి ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేస్తున్నారని, బయోమెట్రిక్ ధ్రువీకరణతో రేషన్ డీలర్లు నేరుగా వారి ఇళ్లకు వెళ్తున్నారని తెలిపారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పాటించడంలో రాష్ట్రంలో 99.06 శాతం ఈకేవైసీ పూర్తి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినట్లు మంత్రి వెల్లడించారు. అక్రమ రవాణా, దుర్వినియోగంపై చేపట్టిన చర్యల్లో భాగంగా ఇప్పటివరకు 5,354 కేసులు నమోదు చేసి 7,32,675 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంనాటి పెండింగ్ బకాయిలను రెండు విడతల్లో రూ.1,000 కోట్లు, రూ.674 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మిల్లెట్స్‌తో పాటు పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు సమావేశంలో పాల్గొన్నారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వం

- **ఐదు కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక చేయూత**
- **బాధిత కుటుంబాలకు అండగా.. విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా**
- **ఆపదలో అండగా నిలిచిన మంత్రి సుభాష్**



రామచంద్రపురం (చైతన్య రథం): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఔదార్యాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఐదు కుటుంబాలకు మొత్తం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధలో ఉన్న వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన సమయంలో చేయూతనివ్వడం తన బాధ్యతగా భావిస్తూ మంత్రి సుభాష్ అందిస్తున్న సహాయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఇటీవల రామచంద్రపురం రూరల్ మండలం వేగాయమ్మపేటకు చెందిన గుబ్బల సూరిబాబు పొలంలో జరిగిన గడ్డివాము అగ్నిప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సుభాష్, భార్య గుబ్బల మల్లేశ్వరికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. అలాగే కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెంకే నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు పెంకే సూర్య చంద్రశేఖర్‌కు రూ.30,000 ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

పేద పురోహితుడు సరస్వతీ స్వామి విజయానంద స్వామికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించి వారి అవసరాలకు అండగా నిలిచారు. అలాగే ద్రాక్షారామం బియ్యంపేటకు చెందిన కోడూరి శ్రవణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆయన కోలుకునే వరకు నెలకు రూ.10,000 చొప్పున సహాయం అందిస్తానని హామీ ఇచ్చిన మంత్రి సుభాష్, ఆ హామీని నిలబెట్టుకుంటూ మూడో నెలకు సంబంధించిన రూ.10,000ను ఆయన తల్లి జ్యోతికి అందించారు. అదేవిధంగా అమలాపురానికి చెందిన నిరుపేద విద్యార్థిని కేశనకుర్తి హర్షిత ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేందుకు రూ.20,000 ఆర్థిక సహాయం అందించి విద్యకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ విధంగా వివిధ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు, ఒక విద్యార్థినికి కలిపి మొత్తం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్, సమాజం పట్ల తనకున్న బాధ్యతను మరోసారి చాటుకున్నారు.

కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలను ప్రజలు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందిస్తున్నారు. సామాజిక బాధ్యతతో ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కొనియాడుతున్నారు.

# పకడ్బందీగా ఓటర్ జాబితా సిద్ధం చేయాలి

- **ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్ జాబితా అత్యంత కీలకం**
- **అర్హులకు ఓటు హక్కు కల్పించాలి..**
- **నకిలీ ఓటు ఉండడానికి వీల్లేదు**
- **రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి**
- **సర్‌పై అవగాహన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం (చైతన్య రథం): రాజకీయ పార్టీకి ఎన్నికలు అత్యంత కీలకం, అందులో ఓటర్ జాబితా మరింత కీలకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సర్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. 2002 తర్వాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం జరుగుతోంది. ఓటరు జాబితాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ నెల 10లోగా నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి చేసుకుని, 14లోపు మండల స్థాయి సమావేశాలు పూర్తి చేసుకోవాలి. ఎన్నికల్లో పోటీ చేయడం అనివార్యం. గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉంది. ప్రతి ఒక్క పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరిగిన ఎన్నికలు గమనిస్తే.. ఓటర్ జాబితా అత్యంత కీలకం. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. తీవ్ర నష్టం జరుగుతుందని 2019 ఎన్నికలు నిరూపించాయి. 2019 ఎన్నికల్లో ఒక్కో బూతుకు సగటున 10 ఓట్ల వరకు తొలగించారు. మొత్తం 200 బూత్‌లలో దాదాపు ఐదారు వేల ఓట్లు తొలగించారు. అంతే తేడాతో ఓటమి పాలయ్యామని వివరించారు.

అందుకే ఇప్పుడు ఓటర్ జాబితాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. బూత్ లెవల్ ఏజెంట్లు క్రియాశీలకంగా వ్యవహరించాలి. ప్రతి ఒక్కరూ వారి వారి బూత్‌లో ఓటర్ జాబితాను పరిశీలించాలి. పాత కొత్త ఓటర్ జాబితాలను దగ్గర పెట్టుకుని ఓట్లను చెక్ చేసుకోవాలి. చనిపోయిన వారి ఓటు తొలగించారో లేదో పరిశీలించాలి. అదే సమయంలో కొత్త ఓటుకు అర్హత ఉన్న వారికి కూడా ఓటు హక్కు కల్పించాలి. ఫారం 6, 7, 8 గురించి ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలి. జూన్ 15 నుండి జులై 14 వరకు ఇంటింటికి అధికారులతోపాటు వెళ్లి ఓట్లను పరిశీలించాలి. పోలింగ్ స్టేషన్లలో ఏమైనా మార్పులు చేర్పులు వచ్చినా వారికి వివరించాలి. జులై 21న ముసాయిదా వస్తుంది. అందులో ఏమైనా లోటుపాట్లు ఉంటే పరిశీలించాలి. సెప్టెంబరులో తుది ఓటర్ జాబితా వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని రెండేళ్లు పూర్తైన సందర్భంగా అందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. మిగిలిన హామీలను కూడా త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, అభివృద్ధి, పోలవరం, అమరావతి నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు.



ఎప్పుడూ మహానాడుకు మనం వెళ్తాం. కానీ ఈసారి మహానాడు మన వద్దే జరిగింది. సుమారు 11 క్లస్టర్లలో అద్భుతంగా నిర్వహించాం. జిల్లాలోనే అత్యధికంగా 20 వేల మందితో మహానాడు నిర్వహించుకోవడం అభినందనీయం. ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ స్థాయిలో సమావేశం నిర్వహించుకుంటున్నాం. మండల స్థాయి, పట్టణ స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని నిర్ణయించారు. ప్రతి క్లస్టర్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో గడపగడపనా ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించాలి. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయబోతున్నాం. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ వంటి పథకాలు కూడా అమలు చేయబోతున్నాం. కూటమి పార్టీ నాయకులంతా కలిసి అడుగేస్తూ ప్రభుత్వ విజయాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రం కోసం పడుతున్న కష్టాన్ని ప్రతి ఒక్కరం గుర్తించాలి. గూగుల్, అర్సెలార్ మిట్టల్ లాంటి సంస్థలు ఏపీకి వచ్చాయంటే అది ప్రభుత్వ ఘనత. త్వరలోనే బందరు పోర్టును పూర్తి చేయబోతున్నాం. షిప్ బిల్డింగ్ కంపెనీ కూడా బందరులో ఏర్పాటు కాబోతోంది.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతున్నాడు. నిన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్ రెడ్డి.. ఇప్పుడు మావిగన్ అంటున్నాడు. జగన్ రెడ్డి పీఏ సుమారు 1500 కోట్లు ఆస్తులు కూడబెట్టాడు. అంటే జగన్ రెడ్డి దోపిడీ ఏ స్థాయిలో ఉంటుందో ఆలోచించండి. తల్లి, చెల్లికి న్యాయం చేయనోడు రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానంటున్నాడు. రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచిన జగన్ రెడ్డి.. ఇప్పుడు వెన్నుపోటు అంటున్నాడు. సంపూర్ణ మద్యపాన నిషేధం అన్న జగన్ రెడ్డి.. మద్యంలో దోపిడీ మొత్తం బయటకొస్తోంది. కన్న తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించి తండ్రికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. రూ.3000 పెన్షన్ పేరుతో వృద్ధులకు వెన్నుపోటు పొడిచాడు. బాబాయి హత్య కేసులో సొంత చెల్లికి వెన్నుపోటు పొడిచాడు. ఇలాంటి గొడ్డలి పార్టీ విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్త చెప్పారు.

బందరులో ఉన్న బియ్యం దొర.. ఎప్పుడూ ఏదో ఒకటి వాగడం తప్ప సాధించేదేమీ లేదు. బందరులో పోటీ చేయడానికి భయపడి పారిపోయినోడు.. గుడివాడ, గన్నవరం నాయకులకు టికెట్లు లేవు అంటూ వాగుతున్నాడు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ.. పేర్ని నాని, కొడాలి నాని, జోగి రమేశ్ లాంటి వారు మంత్రులుగా ఉండి ఏమైనా ఉద్ధరించారా? ఒకడు బియ్యం దోపిడీ, మరొకడు గంజాయి, ఇంకొకడు పేకాటతో జిల్లా పరువు తీశారు. పోలీసులకు అన్యాయం చేసిందని మాట్లాడుతున్న పేర్ని నాని.. గత ఎన్నికల్లో పోలీసులు మిమ్మల్ని ఛీ కొట్టి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్న విషయాన్ని గుర్తుంచుకోండి. మీలాంటి రాక్షస మూక మాకొద్దని తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేసుకోండి. నంద్యాల జిల్లాలో వైఎస్ విగ్రహం తలను వైసీపీ కార్యకర్త విరగ్గొడితే.. దాన్ని రాజకీయం చేయాలనుకున్నారు. కులం మతం ప్రాంతం పేరుతో రాజకీయం చేయాలనుకుని భంగపడ్డారు.

తెలుగుదేశం పార్టీలో పని చేసిన వారికి తగిన గౌరవం ఇస్తాం. రాజ్యసభ సీట్ల గురించి కూడా నీతిమాలిన రాజకీయం చేస్తున్నాడు. గతంలో గుడివాడలో బీసీలను రెచ్చగొట్టాలని ప్రయత్నించాడు. పవన్ కళ్యాణ్ గురించి నీచంగా మాట్లాడాడు. చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ పార్టీ కోసం చేసిన కృషి ఏంటో పార్టీలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అలాంటి వారి గురించి, మా పార్టీ గురించి మాట్లాడే అర్హత మీకు లేదని గుర్తుంచుకో పేర్ని నానీ అని హెచ్చరించారు.

గత ఐదేళ్లు ఏరోజైనా బీసీలను గానీ, ఎస్సీని గానీ కూర్చోబెట్టారా? బీసీ, ఎస్సీ ఎమ్మెల్యేలను జగన్ రెడ్డి ముందు మోకాలిపై కూర్చోబెట్టినోళ్లు కూడా కులం గురించి మాట్లాడడం సిగ్గుచేటు. మచిలీపట్నంలో పేర్ని నాని లాంటి దుర్మార్గులు ఉండడం మన దౌర్భాగ్యం. మచిలీపట్నం పోర్టును ఉద్యమాలతో సాధించుకుంటే.. పెయిడ్ ఆర్టిస్టులు అన్న దుర్మార్గుడు పేర్ని నాని. బందరు పోర్టు పూర్తి చేయకపోతే ముక్కు నేలకు రాస్తానన్న పేర్ని నాని ఎందుకు మాట తప్పాడు. ఇప్పుడు బందరు పోర్టును తెలంగాణకు ఇచ్చేస్తున్నామంటున్నాడు. ఈ రోజు చెబుతున్నా.. బందరు పోర్టు కోసం పోరాడింది మేమే.. శంకుస్థాపన చేసింది మేమే.. పూర్తి చేసేది కూడా మేమే. పోర్టు విషయంలో ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా.. ప్రజలు నమ్మబోరు. బందరు పోర్టు నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఎన్ని కుట్రలు చేసినా పూర్తి చేసి చూపిస్తాం. వైసీపీ నేతల అరాచకాలపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొల్లు పేర్కొన్నారు.

ఓటర్ జాబితాను పూర్తి చేసుకున్న తర్వాత జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 డివిజన్లు, 34 పంచాయతీల్లో కూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలి. నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేస్తాం. మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఈ ఏడాదిలో ప్రారంభించి వచ్చే ఏడాది నాటికి ప్రతి ఇంటికీ అందించి తీరుతాం. నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటుగా యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తాం. అవసరమైన మేరకు ఇక్కడే ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఉపాధి కల్పిస్తాం. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో అనూహ్య మార్పులు సాధించి చూపిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, పట్టణాధ్యక్షులు లోగిశెట్టి స్వామి, బాబాప్రసాద్, కుంచె దుర్గాప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, రూరల్ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూలదోసిన

# వైసీపీ నేతలే నేడు నీతులు చెప్తున్నారు!

- బందరు పోర్టు గోగిలేరుకు తరలించడాన్ని సమర్థించిన నీచుడు పేర్ని నాని
- వైసీపీ నేతల ఐదేళ్ల దోపిడీ దందా మొత్తం దర్యాప్తులో బయటపడుతోంది
- జగన్ సహా వైసీపీ నేతలకు రాజకీయ కుట్రలే ముఖ్యం
- ప్రజలు ఈడ్చికొట్టినా బుద్ధి రాలేదంటూ మంత్రి కొల్లు ఎద్దేవా

మచిలీపట్నం (చైతన్య రథం): జగన్ రెడ్డి నుండి వైసీపీ నాయకులంతా మతిభ్రమించి, అభూతకల్పనలు మాట్లాడడం, బురద వేయడం అనే ఆలోచన తప్ప రాష్ట్ర అభివృద్ధి మచ్చుకైనా పట్టదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజలు వారిని బకరాల్లా చూస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నాం, మాట్లాడేది ప్రజలంతా గమనిస్తున్నారనే కనీస ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారని, నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే



ప్రజలు హర్షించరని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

గత ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓడించారో జగన్ రెడ్డి ఇప్పటికీ తెలుసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకూడదు, పెట్టుబడులు రాకూడదు, కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి రాష్ట్రం నాశనమవ్వాలని కోరుకునే దుర్మార్గుడు జగన్ రెడ్డి అని విమర్శించారు.

జనవరి 16, 2007న పండగ రోజున బందరు పోర్టును గోగిలేరుకు తరలించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తొట్టతొలి సంతకం పెట్టిన వ్యక్తి పేర్ని నానేనని గుర్తు చేశారు. బందరు పోర్టు సాకారమైందంటే అది ఎంతో మంది పోరాట ఫలితమని అన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండికూడా బందరు పోర్టులో కనీసం పనులు చేయలేదని, కూటమి అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసే లక్ష్యంతో అడుగులు వేస్తుంటే.. తెలంగాణకు అమ్మేస్తున్నారని పేర్ని నాని సిగ్గులేకుండా వాగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బందరు పోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మిస్తోందని, పోర్టు పనులు పూర్తయ్యాక నిర్వహణ విధానం నిర్ణయిస్తారని వివరించారు. బందరు పోర్టు అభివృద్ధి చూసి తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని 12 వరుసల రోడ్డు ఇవ్వమని కోరితే అది చీకటి ఒప్పందం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈస్ట్ కోస్ట్ గేట్‌వేగా బందరు నిలవబోతోందని, దక్షిణాదిలో బందరు పోర్టు అత్యంత కీలకం కాబోతోందని దేశం మొత్తం గుర్తించిందని అన్నారు. మూలపేట పోర్టు, రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, కాకినాడ పోర్టులు పూర్తయిన తర్వాత ఆ ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. పోర్టులన్నింటినీ అనుసంధానిస్తూ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచిస్తోందని, నేషనల్ హైవే, వాటర్ వే ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

మచిలీపట్నం – రేపల్లె రోడ్డు మార్గం డీపీఆర్ సిద్ధం చేశామని, తర్వాత చీరాల, బాపట్ల మీదుగా హైదరాబాద్ వరకు అనుసంధానిస్తామని చెప్పారు. రాష్ట్రంలో చెన్నై – కలకత్తా మధ్య నాలుగు వరుసల రైల్ లైన్ ఏర్పాటుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు.

ఫిషింగ్ హార్బర్ అంచనాలు పెంచి మొబిలైజేషన్ ఫండ్స్ పేరుతో దోచుకోవడం తప్ప చిన్న పని అయినా పూర్తి చేయలేదని విమర్శించారు. గతంలో చేసిన దోపిడీ ఒక్కొక్కటీ బయటకు వస్తోందని, స్కాంలు, దోపిడీలు అన్నీ వెలుగులోకి వస్తుండడంతో రోజుకో డ్రామా ఆడుతున్నారని దుయ్యబట్టారు. దమ్ముంటే అరెస్టు చేయండని అంటున్న పేర్ని నాని బెయిల్ కోసం ఎందుకు పరుగులు తీశారో సమాధానం చెప్పాలని సవాలు విసిరారు.

ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలని భావిస్తున్నామని అన్నారు. గతంలో జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతిని శాసనసభ స్పీకర్‌గా అవకాశం కల్పించామని, వెనుకబడిన సామాజిక వర్గాలకు న్యాయం చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి ఐదేళ్ళ అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాల వారిని గడప కూడా దాటనివ్వలేదని, బీసీ వర్గాల వారిని మోకాలిపై కూర్చోబెట్టారని, అలాంటి వారు నీతులు మాట్లాడడం హాస్యాస్పదమని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు.

# రెండేళ్ల కూటమి పాలన అద్వితీయం!

అధ్వాన్న, అహంకార, అరాచక పాలనలో అత్యంత దయనీయ పరిస్థితిలోకి నెట్టబడిన ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడి నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం, అధికార పగ్గాలు చేపట్టిన నాటినుంచి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను గాడిలో పెడుతూ, పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పాలనా విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక వసతుల కల్పన, పారిశ్రామికీకరణ మరియు పారదర్శక పాలన దిశగా అడుగులు వేసిన ఈ ప్రస్థానం రాష్ట్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. పాలనలో జవాబుదారీతనం, అభివృద్ధిలో వేగం –ఈ రెండింటినీ మేళవించి ఆదర్శంగా నిలిచింది.

2024 జూన్ 12న బాధ్యతలు చేపట్టిన కూటమి ప్రభుత్వానికి అన్నీ గడ్డు పరిస్థితులే. అగాధంలో ఆర్థిక పరిస్థితి, అప్పులు, అభివృద్ధి పూర్తిగా అడుగంటి ఆంధ్రప్రదేశ్ అస్తిత్వమే ప్రశ్నార్థకంలో ఉంది. అటువంటి అడ్డంకులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం సర్వ శక్తులు ఒడ్డింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు సూత్రాలను ప్రాతిపదికగా చేసుకుని సాగిన రెండేళ్ల ప్రయాణం రేపటి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సాగుతున్న ప్రస్థానం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం. పాలన అంటే అధికారం అనుభవించడం కాదు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమని నిరూపించింది కూటమి. గత ఐదేళ్ల దుర్భర దృశ్యాన్ని మార్చి నవ్యాంధ్రకి దశ, దిశ కల్పించిన కూటమి రెండేళ్ల పాలన అద్వితీయమనే చెప్పాలి.

**పాలసీలు వేసిన ప్రగతి బాటలు**

ప్రజాస్వామ్యంలో ఒక ప్రభుత్వానికి రెండేళ్ల కాలం అనేది కేవలం పునాది మాత్రమే కాదు, ఆ ప్రభుత్వం ప్రయాణించబోయే దిశను ప్రతిబింబించే అద్దంలాంటిది. రెండేళ్ల కాలంలో కూటమి నాయకత్వం అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా చేసిన పాలసీలు రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశాయి. రాజకీయ చదరంగంకంటే ప్రజా క్షేమమే ముఖ్యమనే భావనను ప్రతి అడుగులోనూ నిరూపించింది కూటమి.

ఒకవైపు పేదరిక నిర్మూలన, సామాజిక భద్రత కోసం విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, మరోవైపు పారిశ్రామిక వృద్ధి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోశారు. విద్య, వైద్య రంగాల ఆధునీకరణతో సామాన్యుడికి నాణ్యమైన సేవలను చేరువ చేశారు. సరికొత్త పారిశ్రామిక పాలసీల ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, యువతకు లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకుంటూ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేర్చడం ద్వారా దళారీ వ్యవస్థకు చెక్ పెట్టారు. సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతుండటం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం.

**రెండేళ్లలో సాధించిన విజయాలు అంకెల్లో కాదు, ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం!**

ఆర్థిక ఇబ్బందులు, విభజన సమస్యలు, గత ప్రభుత్వ విధ్వంసం ద్వారా వచ్చిన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. కేంద్రంతో సానుకూల సంబంధాలను కొనసాగిస్తూ రాష్ట్ర హక్కులను, నిధులను సాధించుకోవడంలో చూపిన చొరవ ప్రశంసనీయం. గడిచిన రెండేళ్లలో సాధించిన విజయాలు కేవలం అంకెల్లో కొలవగలిగేవి కావు – అవి ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషంలో ప్రతిఫలిస్తున్నాయి. భయభ్రాంతులు లేని వాతావరణం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకమైన సేవలు, ప్రతి చిన్న సమస్యకు ప్రభుత్వం స్పందిస్తుందనే నమ్మకం – ఇవి ప్రజల ముఖాల్లో కొత్త కళను తీసుకువచ్చాయి. తమకు అండగా ప్రభుత్వం ఉందనే ధీమా ప్రజల్లో పెరిగింది. అధికారంలో ఉన్నవారు ప్రజల కష్టాలను గుర్తించి పరిష్కరించడానికి చూపే చిత్తశుద్ధి, పాలనలో పారదర్శకత ప్రజల్లో ప్రభుత్వ పట్ల గౌరవాన్ని పెంచాయి.

**ప్రతీ పథకం ఒక కుటుంబానికి భరోసాగా నిలిచింది!**

రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ–అభివృద్ధి పథకాలు ప్రతీ రంగంలోనూ ప్రతీ పౌరుడూ గర్వించే పురోగతిని సాధించాయి. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలవుతున్నాయి – తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు చెల్లింపు, స్త్రీ శక్తి ద్వారా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో 71 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం, దీపం 2 పథకం ద్వారా 4.26 కోట్ల సిలిండర్ల పంపిణీ, అన్న క్యాంటీన్ ద్వారా 9.71 కోట్ల భోజనాలు, అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ, ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రతా పెన్షన్లకు రూ.65 వేల కోట్లకు పైగా వ్యయం జరిగింది.

ఇవే కాకుండా మత్స్యకారులకు రూ.250 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు జమ అయ్యాయి. పీ–4 ద్వారా పేదరిక నిర్మూలన –2 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శుల చేయూత, 5.5 లక్షల ఇళ్లు పేదలకు అందజేత, మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పం, మైనారిటీ సంక్షేమానికి రూ.3,670 కోట్లు, పురోహితులకు రూ.15,000, నాయీ బ్రాహ్మణులకు రూ.25,000కు వేతనాల పెంపు, చేనేతలకు ఉచిత విద్యుత్, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం, 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ రూఫ్ టాప్ –ఇలా ప్రతీ వర్గాన్ని ఆదుకున్నారు.

నియామకాల విషయంలో ముఖ్యమంత్రి తొలి సంతకంతోనే మెగా రిక్రూట్‌మెంట్ ప్రారంభమైంది. 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ పూర్తయింది. స్టైఫండ్ రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లించారు. అన్ని రంగాల్లో కలిపి 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరిగింది.

**సవాళ్లను అధిగమిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపింది!**

మౌలిక సదుపాయాల రంగంలో భవిష్యత్ నగరంగా అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతోంది – కేంద్రం శాశ్వత, ఏకైక రాజధానిగా గెజిట్ జారీ చేసింది. రూ.861 కోట్లతో 20,060 కి.మీ పాత్‌హోల్ ఫ్రీ రోడ్లు, రూ.2,500 కోట్లతో రహదారుల నిర్మాణం, విజయవాడ –మచిలీపట్నం 6 లైన్ రోడ్డుకు ఆమోదం జరిగింది. లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌కు గెజిట్ వెలువడింది. జులై నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుంది.

వ్యవసాయ రంగంలో రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ జరిగాయి. పొగాకు, మామిడి, కోకో, ఉల్లి పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా రూ.1,100 కోట్లు అందించారు. సాగునీటి ప్రాజెక్టులకు 23 నెలల్లో రూ.24 వేల కోట్లు వ్యయం చేశారు. పోలవరం నిర్మాణంలో డయాఫ్రం వాల్ పూర్తయింది, నిర్వాసితులకు రూ.2 వేల కోట్లతో పునరావాసం, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ జులై నాటికి పూర్తవుతుంది. రాయలసీమలో అన్ని చెరువులు, ప్రాజెక్టులు నింపి సాగు, తాగునీరు అందిస్తున్నారు.

పారిశ్రామిక రంగంలో 28 నూతన పాలసీలు రూపొందించారు. ఒక్క ఏడాదికే దేశంలోని పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చింది – బిజినెస్ రిఫార్మర్ అవార్డు సాధించారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. విశాఖ ఐటీ హబ్, రాజధానిలో క్వాంటం వ్యాలీ, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్, రిలయన్స్ డేటా సెంటర్, ఎల్జీ, క్యారియర్ ఏసీ పరిశ్రమ, రెన్యూ ఎనర్జీ, వీపీఎవి డిఫెన్స్ ప్రాజెక్ట్ వంటి భారీ పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయి. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ –11.28 శాతానికి చేరింది. రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ సభలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడం, క్షేత్రస్థాయి అభిప్రాయ సేకరణ, ప్రాంతీయ వివక్షకు తావులేకుండా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామనే భరోసా కల్పించడం అనే మూడు లక్ష్యాలను సాధించాయి. ఏదేమైనా కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపింది. సంక్షేమం మరియు అభివృద్ధిని జోడెద్దులలా తీసుకెళ్తూ రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేయగలదన్న నమ్మకాన్ని బలంగా కలిగించింది.

- నీరుకొండ ప్రసాద్

మంగళవారం 9 జూన్ 2026

జోన్-1

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు

చైతన్యరథం

# ప్రతీ ఓటునూ క్షుణ్ణంగా పరిశీలించాలి

## రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): ఓటరు జాబితాలో ఉన్న ప్రతీ ఓటరు యొక్క సమగ్ర వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఆమె క్యాంపు కార్యాలయంలో సోమవారం బూట్, క్లస్టర్ ఇంచార్జీలకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు దీూా లు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలన చేశారా లేదా అనే విషయంపై అవగాహన ఉండాలన్నారు. ఓటరు జాబితా ప్రకారం ఓటరు ఆ గృహంలో ఉండే కూడా తొలగించినా, లేదా వేరే బూత్ లోకి మార్చినా వెంటనే సరిచేసుకోవాల్సిన అవశ్యకత పై అవగాహన చేశారు. అలాగే ఒకే ఓటరు పేరు రెండు లేదా మూడు చోట్ల ఉంటే వాటిని గుర్తించి వాస్తవంగా ఏ బూత్ లో ఉండాలో అక్కడే ఉంచి మిగిలిన అదనంగా ఉన్న వాటిని తొలగించే ప్రక్రియపై ఎలా ఉండాలో తెలియజేశారు. అలాగే 18 సం"లు దాటిన వారిని కొత్తగా ఓటరుగా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాముఖ్యంగా నకిలీ ఓటర్లపై చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దానికి గాను క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ ఇంచార్జీలు స్థానికంగా అవగాహన ఉన్న మన పార్టీ పెద్దలతో ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దానిలో గుర్తించిన లోపాలను సంబంధిత అధికారులకు చెప్పి చేర్పులు మార్పులు చేయించాలన్నారు. దీనిలో అప్రమత్తంగా లేకపోతే ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ క్లస్టర్, బూత్ ఇంచార్జీలు చాలా పకడ్బందీగా దీనిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ాావీజ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జి ముప్పన కేశవ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, తెదేపా నాయకులు గణజాల తాతారావ్, ాావీజ డైరెక్టర్ గట్టి మాణిక్యం, బూత్ ఇంచార్జ్ాలు నూకరాజు , ముర్ల వీరబాబు, చవల కుమార్, తేజ, బన్ను తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నుండి టీడీపీలోకి భారీగా చేరికలు

## ఆహ్వానించిన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం (చైతన్యరథం): సీతానగరం మండలం గుచ్చిమి గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. సోమవారం నర్సిపురం భాను కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతుల మీదుగా గుచ్చిమి గ్రామానికి చెందిన బూరాడ చిరంజీవి ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాలు పసుపుకండువ కప్పుకొని టిడిపిలో చేరి, వైసీపీని వీడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వము అందించలేని సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని, మన రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పై నమ్మకం ఉంచి భారీ ఎత్తున ప్రజలు టీడీపీలోకి చేరేందుకు సంసిద్ధులవుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో సత శాతం ఫలితాలు లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని, పార్టీలో చేరిన వారందరికీ సముచిత గౌరవం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

## బీఎల్ఏలకు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే పిలుపు

కురుపాం (చైతన్యరథం): రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో పార్టీ బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)' ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై పార్టీ బీఎల్ఏలకు ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా ప్రక్రియలో పార్టీ ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అనంతరం పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో మరింత సమన్వయం పెంపొందించుకునే అంశాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీకి అండగా నిలిచి గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి బిడ్డిక పద్మావతి, రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, అరకు పార్లమెంట్ సహాయ కార్యదర్శి తాడంగి రామారావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, కురుపాం మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ కద్రక కళావతి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె.వి.కొండయ్య, జోగి భుజంగరావు, మరడన నారాయణస్వామి, పార్టీ నాయకులు మద్రాపు పురుషోత్తం నాయుడు, సోములు మాస్టర్, కోట సుమన్, కోలా రంజిత్ కుమార్, బీఎల్ఏలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జీలు, నాయకులు, కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

# సమగ్ర ఓటరు జాబితా కోసం అప్రమత్తం

ఓటర్ల జాబితా సవరణ విషయంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి సూచించారు. పాడేరు మండలం వంట్లమామిడి, సలుగు, అయినాడ, దేవాపురం పంచాయతీలో సోమవారం క్లస్టర్ ఇన్చార్జి, యూనిట్ ఇన్చార్జిలు, కో ఇన్చార్జిలు 15 మంది బూత్ కన్వీనర్ల, కో కన్వీనర్లతో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ) పై వర్క్ షాప్ నిర్వహించారు. 10వ క్లస్టర్ ఇంచార్జ్, పాడేరు పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం జరుగుతున్నప్పుడు ఇంటింటికి తెలుగుదేశం కార్యకర్తలు వెళ్లాలని సూచించారు. వాస్తవంగా ఉన్న వారికి మాత్రమే జాబితాలు అవకాశాలు కల్పించేలా చూడాలన్నారు. స్థానికేతరులు గానీ , ఆ గ్రామానికి చెందని వారు గానీ ఆ గ్రామంలో లేనివారు గాని ఓటర్ లా గుర్తించడానికి అంగీకరించొద్దన్నారు. ఇతర మండలాల్లో ఉంటూ మీ గ్రామాల్లో కూడా ఓటరు గా ఉంటే దాన్ని కూడా అంగీకరించొద్దు అన్నారు. ఎక్కడో ఒకచోటే ఓటు నమోదు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. మరణించిన వారు, వలస వెళ్లి చాలా కాలంగా అక్కడే ఉండిపోయిన వారు ఓటర్లగా నమోదు చేసుకోవద్దని ఎక్కడ నివాసం ఉంటే అక్కడే నమోదు చేసుకునేలా కార్యకర్తల అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఎంత అప్రమత్తంగా ఉంటే అంతగా ఉపయోగ ఉంటుందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలుపోవటం నిర్ణయించేది ఓటరలేనని తెలిపారు. ఓటరు జాబితాలో గ్రామస్తులే ఉంటే ఏ సమస్య ఉండదని స్థానికేతరులు ఓటర్లుగా ఉంటేనే వారికి గ్రామాభివృద్ధి తో



సంబంధాలు ఉండవని ప్రలోభాలకు గురై గ్రామాలకు సేవలు అందించే వారిని ఓడించేందుకు ప్రయత్నించేస్తారన్నారు. అందుకే అసలైన ఓటర్లే జాబితాలో ఉండేలా చూసుకునే బాధ్యత కార్యకర్తలు దేని అన్నారు.



# కూటమి కేడర్‌లో ఐక్యతాస్ఫూర్తి నింపడమే లక్ష్యం

## టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఏలూరు (చైతన్యరథం): కూటమి పార్టీల క్యాడర్‌లో ఐక్యతా స్ఫూర్తి నింపడపైనే తాము ఫోకస్ అంతా పెట్టామని టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. నరసాపురం, ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన అనంతరం తొలిసారి ఏలూరుకు విచ్చేసిన ప్రత్తిపాటికి ఘన స్వాగతం లభించింది. స్థానిక పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బడేటి చంటి అనంతరం జిల్లాస్థాయిలో పార్టీ పటిష్టత, కూటమి ఐక్యతాంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా భేటీలో టిడిపి జోనల్ కో-ఆర్డినేటర్ ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య సమన్వయం, సర్దుబాటే తమ ప్రధాన ఎజెండా అని వివరించారు. అందర్నీ ఒక్కత్రాటిపైకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇదే సమయంలో అంతర్గత విభేదాలను పక్కన పెట్టి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వైసిపి చేస్తోన్న విష ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని కూటమి శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ టిడిపి అధిష్టానానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలకు మధ్య ప్రధాన సంధానకర్తగా వ్యవహరిస్తూ ప్రాంతీయ సమన్వయకర్త పుల్లారావు తన అనుభవంతో తమకు సలహాలు, సూచనలు అందించాలని, అలాగే పార్టీ కోసం కష్టించిన వారికి న్యాయం చేసేలా అధిష్టానం దృష్టికి తమ ఆలోచనలను కూడా తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే బడేటి చంటి అభిలాషించారు. దాంతోపాటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా అటు ప్రజలు, ఇటు కూటమి నేతలు అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన సందర్భాన్ని, అవసరాన్ని విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, పార్టీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, మాజీ డిప్యూటి మేయర్ పప్పు ఉమా, నాయకులు ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే కావ్య

కావలి (చైతన్యరథం): కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి అర్జీని పరిశీలించి బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, పెండింగ్‌లో ఉన్న సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి




సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సేవలను ప్రజలు అభినందిస్తున్నారు. ప్రతిరోజూ ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవలో నిమగ్నమవుతున్న ఎమ్మెల్యేకు ప్రజలు తమ ఆశీర్వాదాలు, మద్దతు అందిస్తున్నారని పలువురు పేర్కొన్నారు.



పుట్టపర్తి నియోజకవర్గ క్లస్టర్ కన్వీనర్ మరియు కో కన్వీనర్, యూనిట్ కన్వీనర్, కో కన్వీనర్ ముఖ్య నాయకులు పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 "శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఅతీ ప్రక్రియలో పాల్గొని చురుకుగా పాల్గొని మ్యాపింగ్ చేయవలసిందిగా ఎమ్మెల్యే సూచించారు.




# శ్రీ నాగారపమ్మ తల్లి జాతర శుభాకాంక్షలు

## రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి (చైతన్యరథం): సుండుపల్లి మండలం, పేదినేనికాల్వ గ్రామం, బండకాడ ఈడిగపల్లెలో కొలువై ఉన్న శ్రీ శ్రీ నాగారపమ్మ తల్లి జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరగాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పవిత్ర జాతర సందర్భంగా అమ్మవారి కటాక్షం ప్రతి ఇంటిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం, పాడి పంటల సమృద్ధితో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు, భక్తులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, జాతర మహోత్సవాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు.

# టీడీపీ నేత దేరంగుల మృతి బాధాకరం

## టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి (చైతన్యరథం): రూరల్ మండలం పెమ్మాడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గరుగుపల్లెకు చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు దేరంగుల రామచంద్ర మృతి అత్యంత విషాదకరమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ, రామచంద్ర ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని, వారి మరణం కుటుంబానికి, గ్రామానికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. దేరంగుల రామచంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.



# మంత్రి లోకేష్ ఆలోచనల మేరకు సిద్ధమైన కాజ ఈస్ట్ లేక్ పార్క్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా కాజ గ్రామంలో ఈస్ట్ లేక్ పార్క్ నిర్మాణం పూర్తి కావస్తోంది. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో సెల్కాన్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత సీఎస్ఆర్ నిధుల కింద రూ.3 కోట్ల వ్యయంతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేసింది.సుమారు 17 ఎకరాల 18 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక హంగులతో పార్క్‌ను తీర్చిదిద్దారు. పార్క్‌లో మొత్తం 11,600 మొక్కలను నాటడంతో పచ్చదనంతో నిండిన ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు 1.7 కిలోమీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.అదేవిధంగా ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, భద్రత కోసం ఫెన్సింగ్, ఆధునిక సుందరీకరణ పనులు చేపట్టి పార్క్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఈస్ట్ లేక్ పార్క్ మంగళగిరి ప్రాంత ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇలాంటి పార్క్ ను అందుబాటులోకి తీసుకొచ్చిన మంత్రి నారా లోకేష్‌కు కాజ గ్రామస్తులు, ప్రాంత ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.






# ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బెదిరింపు కాల్స్

## పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్న సీఐ!

పెనమలూరు (చైతన్యరథం): శాసనసభ్యులు బోడే ప్రసాద్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర బెదిరింపులకు పాల్పడిన ఘటన ఆందోళన కలకలం రేపింది. “నా పేరు భాస్కర్ రెడ్డి” అంటూ ౦447773212073 నంబర్ నుంచి ఫోన్ చేసిన వ్యక్తి, ఎమ్మెల్యేని ఉద్దేశించి “నీ ఫ్యామిలీ బయట ప్రాణాలతో ఎలా తిరుగుతుందో చూస్తాం” అంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధిపై ఇలాంటి బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య విలువలపై దాడిగా భావిస్తున్నారు. బెదిరింపులను ఏమాత్రం లెక్కచేయకుండా చట్టంపై విశ్వాసంతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెంటనే పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటనను అత్యంత గంభీరంగా పరిగణించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాల్ చేసిన వ్యక్తి వివరాలు, కాల్ వెనుక ఉన్న ఉద్దేశాలు, ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్తాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. ప్రజాప్రతినిధులను,వారి కుటుంబ సభ్యులను బెదిరించడం సహించరాని చర్య అని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టే వరకు పోలీసులు వెనక్కి తగ్గరని స్పష్టం చేశారు.

# రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

## పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్



పెడన (చైతన్యరథం): మండలంలోని పుల్లపాడు గ్రామంలో “మీ భూమి- మీ హక్కు” పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఈ పట్టాదారు పుస్తకాల ద్వారా రైతన్నలకు భూములకు సంపూర్ణ రక్షణ లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో రెవెన్యూ శాఖలో వినూత్న సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలకు, రైతులకు అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆస్తి అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధ హక్కు అన్నారు. గత ప్రభుత్వం హయాంలో వ్యక్తిగత ఫోటోలతో ముద్రించిన పాసు పుస్తకాలు ఇవ్వడం వల్ల అనేక సాంకేతిక, న్యాయ సంబంధిత సమస్యలు తలెత్తాయన్నారు.ప్రత్యేకంగా అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ముద్రించిన పుస్తకాల విషయంలో సమాజంలో గందరగోళం ఏర్పడిందన్నారు. భూమి రికార్డుల విషయంలో స్పష్టత లోపించిన కారణంగా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తూ భూ యజమానులకు హక్కులపై సంపూర్ణ భరోసాను కల్పిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం తగు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, సోలార్ యూనిట్లు, అన్నదాత సుఖీభవ కింద యేడాదికి రూ.20 వేలు, సకాలంలో ఎరువులు పంపిణీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పన, పాడి రైతులకు గోకులం షెడ్స్, పలు ప్రోత్సాహకాలు ఇస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.



# మంత్రి నారా లోకేశ్ చొరవతోనే ఏపీకి ప్రపంచ ప్రఖ్యాత పరిశ్రమల రాక

## ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురంలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ ఎండీ తేజ ఎంపీకి ఘన స్వాగతం పలికి, సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై వివరించారు. షోరూమ్‌లోని అత్యాధునిక సదుపాయాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను ఎంపీ కేశినేని చిన్ని పరిశీలించి అభినందించారు. అనంతరం ఎంపీ చిన్ని మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రంలో నెలకొన్న సానుకూల పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమన్నారు. ఈ విశ్వాసాన్ని నెలకొల్పడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన లోకేష్, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతులు, పారదర్శక పరిపాలన, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దారని అన్నారు. గతంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాల వైపు వెళ్లిన పరిస్థితుల నుంచి నేడు ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌ను ఆశాజనక పెట్టుబడి కేంద్రంగా గుర్తించడం రాష్ట్రానికి గర్వకారణమని ఎంపీ తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థల రాకతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. “రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలోకి రావడం కేవలం ఒక సంస్థ రాక మాత్రమే కాదనీ,అది నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌పై పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసానికి ప్రతీక అని మంత్రి లోకేష్ కృషిని కొనియాడారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయనీ, ఉద్యోగాలు వస్తే యువత భవిష్యత్తు బలపడుతుందని రాష్ట్ర అభివృద్ధికి ఇది శుభసూచకం” అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాయల్ ఎంఫిల్డ్ షోరూమ్ సిబ్బంది తో ఎంపీ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. అనంతరం సిబ్బంది తో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రముఖులు, పార్టీ నాయకులు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు

## సీనియర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో సమాచారం అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు.

### ప్రత్యేక విమానంలో మృతదేహాల తరలింపు

గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

### క్షతగాత్రులకు వైద్య సేవలు

ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

### నిరంతర పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. తెలుగు అధికారుల సహకారంతో ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టామన్నారు.

బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు.

### మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగిసిన అనంతరం పరిహారం అంశంపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందన్నారు. దూర ప్రాంతంలో జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం పొందాలని ఆకాంక్షించారు.



## సీఎం చంద్రబాబు ఆశీస్సులతో
# అభివృద్ధి పనులన్నీ చేస్తున్నాం

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్, ఇరుకళల పరమే శ్వరి గుడి సెంటర్‌లో కర్మక్రతువుల భవనంలో భోజనశాల ప్రాంగణ అభివృద్ధి పనులనురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ ఈ ప్రారంభించారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కర్మక్రతువుల భవనాలు ఇంకా చాలా కావలసి ఉన్నవి. గత 12 సంవత్సరాల నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అనేక స్మశానవాటికలలో దాతలు స్నేహితుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషిచేసానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో 700 కోట్లతో అభివృద్ధి పనులు కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని జరుగుతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి అన్నిరకాలుగా సహకరిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెలరోజుల్లో శవాలు భద్రపరుచు గదికి శంకుస్థాపన చేసి మరో నెలరోజుల్లో పూర్తిచేస్తామన్నారు. పై కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, 41వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, టిడిపి నాయకులు వెంకటేశ్వర్ల ఆచారి, తంజావూరు వేణు, కొండిశెట్టి సతీష్, అబ్దుల్ గఫూర్, సికిందర్, అద్దంకి కృష్ణ, కె.పి.ఎన్ ప్రసాద్, మస్తానయ్య, రామచంద్రయ్య, మధు యాదవ్, కమలాకర్, ఫైరోజ్, రాపూరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

## బీఎల్లేకు టీడీపీ నేతల పిలుపు

పుంగనూరు (చైతన్యరథం): నియోజకవర్గం పులిచెర్ల మండలం కల్లూరు నందు నియోజకవర్గ స్థాయి ఓటర్ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డినిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా రొంపిచర్ల, పులిచర్ల, సదుం మండలాల క్లస్టర్ యూనిట్ బూత్ గ్రామ కమిటీ మండల కమిటీ సీనియర్ నాయకులతో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి జూన్ 15వ తారీకు నుంచి జూలై 15 తారీకు వరకు బీఎల్లేలులు క్షేత్రస్థాయిలో బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓట్లు చేర్పులు మార్పులు సంబంధించి సంబంధిత పత్రాలను సమర్పించి రసీదులను పొంది ఓటర్ లిస్ట్ మీద ప్రత్యేకమైన శ్రద్ధతో పనిని నిర్వర్తించాలని సూచించారు. బీఎల్ఎల ను సమన్వయం చేసే విధంగా క్లస్టర్ యూనిట్‌లు బాధ్యతగా తీసుకొని టెక్నికల్ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలను తీర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలు అనుబంధ సంఘాలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



# పాలనా సంస్కరణల్లో భాగమే ప్రజా దర్బార్

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): మండల కేంద్రమైన ముండ్లమూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాదర్బార్‌లో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం లో అద్దంకి ఆర్డీఓ విజయజ్యోతి, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, ఎంపీడీఓ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుండి రెవిన్యూ సమస్యలు ఎక్కువగా వినతులు వచ్చాయని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులను ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పవద్దని చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వచ్చే ప్రజా దర్బార్ జరిగే లోపు పరిష్కరించే సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను కోరారు. ఏవైనా జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు ఏమైనా ఉంటే ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ సమస్యలు కూడా స్వీకరించడం జరిగిందన్నారు. కొత్త పెన్షన్ల కోసం వందలు అర్జీలు పెట్టుకున్నారని త్వరలో అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రోడ్లు, డ్రైన్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కొన్ని గ్రామాలలో అవసరమని వినతులు ఇచ్చారని వాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో నిధులను మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మనం ముండ్లమూరు మండలంలో లక్షలాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటర్ ట్యాంకు అవసరమని కూడా ఒక వినతి అందిందని సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు వెంటనే అందుకు సంబంధించిన అంచనాలు రూపొందించాలని ఆదేశించామన్నారు. ఇలా ప్రతి సమస్యకు ప్రజల వద్దకు ప్రభుత్వం వచ్చి పరిష్కరించే దానిలో భాగంగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను స్ఫూర్తిగా తీసుకొని ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రతి అభివృద్ధి సంక్షేమం ప్రతి ఇంటికి చేరాలన్న లక్ష్యంతో మన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగిస్తుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమష్టిగా సమస్యలను అధిగమించాలని ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని డాక్టర్ లక్ష్మీ కోరారు. ఈ కార్యక్రమం లో మండలం లోని అన్ని గ్రామాలనుండి ప్రజలు, మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట రామారావు, మండలం లోని వివిద హోదాల్లో ఉన్న టీడీపి నాయకులు, కూటమి శ్రేణులు హాజరయ్యారు.

# ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమాభివృద్ధి పాలన

## టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి



పాణ్యం (చైతన్యరథం): ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి అధ్యక్షతన నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్.ఎం.డి. ఫరూక్, టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి, పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంపై నాయకులతో చర్చించారు.

# త్వరలో అర్హులందరికీ ఇళ్ళు, పెన్షన్లు

## రాష్ట్ర ప్రజలకు మంత్రి సవిత వెల్లడి



పరిగి (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. పరిగి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులు, అభ్యర్థనలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందేలా కృషి చేస్తున్నామని, ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. అలాగే, త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ హౌసింగ్ పథకం కింద ఇళ్లు, సామాజిక భద్రతా పెన్షన్లు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 723 మంది లబ్ధిదారులకు ఇంటి పొజిషన్ పత్రాలను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, సాగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.








# మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరి లైబ్రరీలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం

## విద్యార్థుల ఫీల్డ్ విజిట్ విద్యార్థుల్లో నూతన ఉత్సాహం

మంగళగిరి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మంగళగిరి పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ప్రత్యేక ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. విద్యార్థులు మంగళగిరి హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి చేనేత చీరల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, స్థానిక పోలీస్ స్టేషన్‌లను సందర్శించి ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందించే సేవలపై అవగాహన పొందారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాన వికాసం, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల ఆసక్తి పెంపొందిందని నిర్వాహకులు తెలిపారు.





# రైతులకు అందుబాటులో ఎరువులు

## మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వెల్లడి

ఆమడగూరు (చైతన్యరథం): రైతులకు వ్యవసాయ అవసరాలకు తగిన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, రైతులకు స్వయంగా ఎరువుల బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి రైతుకు ప్రభుత్వ సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఏ పి ఎరువు బస్తా రూ .1350 లతో యూరియా బస్తా రూ. 268 లతో రైతులకు అందిస్తున్నామని అన్నారు. రైతులకు సరిపడేంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 120 బస్తాల డిఏపీ (ఇఫ్కో), 140 బస్తాల యూరియా నిల్వ ఉంచినట్లు చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు పనులు చేపట్టే విధంగా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, ఓడి చెరువు మండల టీడీపి కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర,సొసైటీ అధ్యక్షుడు నరేష్ ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి ,స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్ర
NRI TDP
చైతన్యరథం

## సౌత్ ఆస్ట్రేలియాలో రామోజీరావు వర్ధంతి సభ

**పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



ఆడిలైడ్ (సౌత్ ఆస్ట్రేలియా): ఈటీవీ, ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు, పద్మవిభూషణ్ స్వర్గీయ రామోజీరావు వర్ధంతిని పురస్కరించుకుని సౌత్ ఆస్ట్రేలియా రాజధాని నగరం ఆడిలైడ్‌లో సౌత్ ఆస్ట్రేలియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంతాప సభ నిర్వహించారు. ఆడిలైడ్‌లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఆడిలైడ్‌లోని తెలుగు ప్రముఖులతో కలిసి రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతికి ఆయన సేవలను కొనియా డారు. పత్రికా రంగంలో, ప్రసార మాధ్యమాల్లో రామోజీ నెలకొల్పిన విలువలు ఎప్పటికీ ఆదర్శనీయమని చెప్పారు. ఆయన కేవలం పత్రికా రంగానికే పరిమితం కాలేదని చెబుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఈనాడు, ఈటీవీ సంస్థల తరపున కోట్ల రూపాయల విరాళాలు ప్రకటించిన మానవతావాది అని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలకే కాకుండా మహా రాష్ట్రలో భూకంపం, ఒడిశాలో ఉప్పెనలు, తుఫానులు సంభవించినా మానవత్వంతో స్పందించి అక్కడ పునరావాస కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆడిలైడ్ నగరంలో సౌత్ ఆస్ట్రేలియా తెలుగు అసోసియేషన్ ఆయనను స్మరించుకుంటూ సభను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. సౌత్ ఆస్ట్రేలియా తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు రామోజీరావు తెలుగు భాషకు, సంస్కృతికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆడిలైడ్‌లో నివసిస్తున్న తెలుగు అసోసియేషన్ ముఖ్య నాయకులు, స్థానిక తెలుగు నగర ప్రముఖులు, ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పాల్గొని రామోజీరావు గారికి శ్రద్ధాంజలి ఘటించారు.

**తానా ఆధ్వర్యంలో**

## శ్రీనివాస కళ్యాణం



హిక్స్‌విల్లే, న్యూయార్క్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి గారి మార్గదర్శకత్వంలో తానా న్యూయార్క్ టీమ్ ఆధ్వర్యంలో గత శనివారం హిక్స్‌విల్లేలోని అసామై హిందూ టెంపుల్‌లో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం భక్త జన సందోహం మధ్య వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయ విధానంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. తానా న్యూయార్క్ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ భర్తవరపు, ఈవెంట్ కోఆర్డినేటర్ ప్రసాద్ కోయి, సుచరిత అనంతనేని, రజిత కల్లూరి తెలిపారు. ఈ కార్యక్రమానికి తానా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రవి పొట్లూరి, కోశాధికారి రాజా కసుకుర్తి, మిడ్-అట్లాంటిక్ రీజినల్ కోఆర్డినేటర్ ఫణి కంతేట, న్యూ జెర్సీ రీజినల్ కోఆర్డినేటర్ సుధీర్ నారెపలేపు, యూత్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ చెరుకూరి, ఫౌండేషన్ కోశాధికారి శ్రీనివాస్ ఓరుగంటి, ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక, దశరథ్ తలపనేని పాల్గొన్నారు. ఏర్పాట్లను సమన్వయం చేసిన న్యూయార్క్ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ భర్తవరపు, ఈవెంట్ కోఆర్డినేటర్ ప్రసాద్ కోయి, రజిత కల్లూరిని అభినందించారు. అలాగే న్యూయార్క్ టీమ్ సభ్యులు దిలీప్ ముసునూరు, శ్రీనివాస్ నాదెళ్ల, జితేంద్ర యార్లగడ్డ, ఉమా పోలిరెడ్డి, శ్రీనివాస్ పలాటి, ప్రదీప్ అరవేటి, రాజేష్ కడియాల, సునీల్ చల్లగుళ్ల, రవీంద్ర ఉప్పాల, సురేష్ మల్నీడి, కృష్ణకిషోర్ జమ్ముల, శ్రీహరి పర్ణ, కలీం మహమ్మద్, రాఘవేంద్ర మాదాల, విజయ్‌కుమార్ లావు కార్యక్రమ విజయానికి విశేష కృషి చేశారు. ఆశ్రిత కోయి ప్రత్యేకంగా దైవ భక్తి గీతాలు ఆలపించారు. స్పెషల్ గెస్ట్ టౌన్ అఫ్ నార్త్ హేంప్‌స్టీడ్, రజినీ శ్రీవాత్సవ పాల్గొన్నారు.



# సౌత్ ఆస్ట్రేలియాలో మహానాడు



**యువనేత లోకేష్ నాయకత్వంలో మరో 50 ఏళ్లు టీడీపీకి తిరుగులేదు - ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



అడిలైడ్: సౌత్ ఆస్ట్రేలియా అడిలైడ్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో మహానాడు పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తూ మూడో తరం నాయకుడిగా లోకేష్ పార్టీని అద్భుతంగా నడిపిస్తున్నారని కొనియాడారు. లోకేష్ సమర్థవంతమైన నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఇంకో 50 ఏళ్ల పాటు ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ లోకేష్ నాయకత్వంపై నమ్మకంతో ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల రాక్షస, తుగ్లక్ పాలనను అంతమొందించి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని మళ్లీ నిలబెట్టడంలో విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు పోషించిన పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. రాత్రనక, పగలనక సోషల్ మీడియా వేదికగా క్షేత్ర స్థాయిలో పార్టీకి మద్దతుగా ఎన్ఆర్ఐలు చేసిన పోరాటం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఈ మహానాడు కార్యక్రమంలో అడిలైడ్ ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు, భారీ సంఖ్య లో తెలుగు కుటుంబాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుండెకు భరోసా..ప్రాణాలకు రక్షణ

**తానా న్యూజెర్సీ ఆధ్వర్యంలో సీపీఆర్ శిక్షణ**





తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) న్యూజెర్సీ బృందం ఆధ్వర్యంలో కెండల్ పార్క్ ఫస్ట్ ఎయిడ్ అండ్ రెస్క్యూ స్క్వాడ్‌లో సీపీఆర్/ఏఈడీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యువత, విద్యార్థులు, స్థానిక కమ్యూనిటీ సభ్యులు పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యాలను అభ్యసించారు. ఈ శిక్షణను చీఫ్ అల్ లో-బీర్ నిర్వహించారు. ఆయన రెండేళ్ల క్రితం తానా అందించిన లుకాస్ చెస్ట్ కంప్రెషన్ సిస్టమ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పరికరం గుండెపోటు వచ్చిన రోగులకు ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో కూడా నిరంతరాయంగా చెస్ట్ కంప్రెషన్స్ అందించడానికి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు శ్రీనివాస్ లావు నాయకత్వంలో జరిగింది. కార్యక్రమం విజయవంతానికి తానా కోశాధికారి రాజా కసుకుర్తి, న్యూజెర్సీ రీజినల్ రిప్రజెంటేటివ్ సుధీర్ చంద్ర నారేపలుపు, కమ్యూనిటీ సర్వీసెస్ కోఆర్డినేటర్ సాయి బొల్లినేని, యూత్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ చెరుకూరి, ఫౌండేషన్ కోశాధికారి శ్రీనివాస్ ఒరుగంటి, ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేకా, ఎన్.జే.తానా కేర్స్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కల్వకోలు, తానా ఎన్.జే. టీమ్ స్క్వేర్ కోఆర్డినేటర్ రవి మాచర్ల, తానా వాలంటీర్లు హరీష్ కోయ, దశరథ్ తాళ్లపనేని, అలాగే స్థానిక హైస్కూల్ విద్యార్థిని, కెండల్ పార్క్ ఈఎంఎస్ వాలంటీర్ వర్షా నారేపలుపు కృషి చేశారు.

**ప్రాణ రక్షణ లక్ష్యం: రాజా కసుకుర్తి**

తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం లుకాస్ పరికరాన్ని తానా అందించినప్పుడు మా లక్ష్యం ఒక్కటే ప్రాణాలను కాపాడడం. తానా యొక్క అసలైన బలం తమ వాలంటీర్లేనని తెలిపారు. రవి మాచర్ల, హరీష్ కోయ, దశరథ్ తాళ్లపనేని, వర్షా నారేపలుపు, భాగమైన ప్రతి వాలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన చీఫ్ అల్ లో-బీర్, కెండల్ పార్క్ ఫస్ట్ ఎయిడ్ అండ్ రెస్క్యూ స్క్వాడ్, వాలంటీర్లకు తానా నాయకత్వం ధన్యవాదాలు తెలిపింది.

# తానా వేసవి క్రీడా సంబరాలు



అమెరికా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం కమ్యూనిటీ కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతున్న సంగతి తెలిసిందే. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో ఆటల పోటీలను తానా ప్రారంభించింది. అందులో భాగంగా శనివారం (జూన్ 6) కన్నపోలిస్‌లోని 'కరోలినా పికిల్‌బాల్ క్లబ్' వేదికగా నిర్వహించిన 'తానా పికిల్‌బాల్ టోర్నమెంట్' అత్యంత వైభవంగా జరిగింది. బిగినర్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్, ఉమెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పోటీలు జరిగాయి. ఎక్కువమంది పాల్గొనడంతో పోటీలు ఆసక్తిగా సాగాయి. ఈ మెగా టోర్నమెం ట్‌లో 65కు పైగా టీములు ఉత్సాహంగా పాల్గొని తలపడ్డాయి. టోర్నమెంట్‌ను ఇంతటి భారీ స్థాయిలో విజయవంతం చేసిన ఆటగాళ్లను, నిర్వాహక బృందాన్ని తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీని లావు ప్రత్యేకంగా అభినందించారు. తానా అప్పలాచియన్ రీజినల్ రిప్రజెంటేటివ్ రవి (నాని) వడ్లమూడి నేతృత్వంలో ఈ ఈవెంట్ విజయ వంతంగా సాగింది. చార్లెట్ పికిల్‌బాల్ టీమ్ సభ్యులు తారక్ పూడి, కార్తీక్ పాండ్రా, పవన్ పెట్టం బరం వెంకట, స్పోర్ట్స్ చైర్ దినేష్ దొంగ తదితరులు ఈ టోర్నమెంట్ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు స్థానిక తానా నాయకులు రవి(నాని) వడ్లమూడి, నాగ పంచు మర్తి, ఠాగూర్ మల్లినేని, మాధురి ఏలూరి, కిరణ్ కొత్తపల్లి, అన్నే రమణ కూడా ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి విశేష కృషి చేశారు. ఈ కార్యక్రమం సజావుగా సాగడంలో తానా ట్రెజరర్ రాజా కసుకుర్తి కీలకపాత్ర పోషించారు. విజేతలు, రన్నరప్‌లుగా నిలిచిన టీములకు ముగింపు వేడుకలో ఘనంగా ట్రోఫీలను అందజేశారు. ఈ ఈవెంట్‌కు స్పాన్సర్లుగా వ్యవహరించిన నవాబీ హైదరాబాద్ హౌస్, కోల్డ్‌వెల్ బ్యాంకర్ రియల్టీ- రఘు వేమూరి, ట్యుటెలరీ ఇంక్ సంస్థలకు తానా నాయకత్వం కృతజ్ఞతలు తెలియజేసింది.





## భారతీయులున్న కార్గో నౌకపై దాడి

ఒమన్: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, భారతీయులు ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌక దాడికి గురైనట్టు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగ్గా.. ఆ సమయంలో నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. దీంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్లు వార్తలు వస్తున్నాయి. పలావు దేశ జెండాతో వెళ్తున్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఆ నౌకలో 24 మంది భారతీయులున్నట్టు సమాచారం. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ దెబ్బతిందని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్‌ఓఎస్ కాల్ పంపినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ దాడి కారణంగా నౌకలోని లైఫ్ బోట్లు కూడా దెబ్బతిన్నట్టు సమాచారం. దాడి కారణంగా ఆ ఓడలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. లైఫ్‌బోట్లు కూడా దెబ్బ తినడంతో తరలింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారినట్టు సమాచారం. కాగా, నౌకపై క్షిపణులు లేదా డ్రోన్‌లతో దాడి జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈదాడికి బాధ్యులు ఎవరనే విషయంలో స్పష్టతలేదు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## పెళ్లికి ముందు అంగీకారంతో సంబంధాలు..

**మోసం, నేరంగా పరిగణించలేం**

**సుప్రీంకోర్టు కీలక తీర్పు**



ఢిల్లీ: పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ సంబంధాలు అన్నీ వివాహానికి దారి తీయవని తెలిపింది. ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది.ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా? లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరుమోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయ పడింది.ఈతీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ,పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# టీఎంసీలో ముదిరిన సంక్షోభం

## స్పీకర్ ఓంబిర్లాకు 20 మంది ఎంపీల లేఖ

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్‌లో తలెత్తిన అంతర్గత సంక్షోభం మరింత తీవ్రమైంది. ఇప్పటికే బెంగాల్ అసెంబ్లీలో 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయనను స్పీకర్ నియమిం చారు. తాజాగా టీఎంసీలో తలెత్తిన తిరుగుబాటు పార్లమెంటుకు పాకింది. పార్టీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. దీనికి కొనసాగింపుగా 20 మందికి పైగా టీఎంసీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు పార్టీవర్గాలు తెలిపాయి.





**ప్రత్యేక గ్రూపు యోచనలో...**

ఓం బిర్లాకు లేఖ రాసిన ఎంపీలు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడే అవ కాశం ఉందని, దీనిపై రెబల్ ఎంపీలు మంతనాలు జరిపారని తెలుస్తోంది. అయితే ప్రత్యేక గ్రూపుగా ఏర్పడేందుకు తగినంత సంఖ్యాబలం అవసరమవుతుంది. లోక్‌సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నందున ప్రత్యేక గ్రూపుగా ఏర్పడేందుకు కనీసం 20 మందికి పైగా ఎంపీలు అవసరమవుతుంది. తగిన సంఖ్యాబలంతో స్పీకర్ ఓంబిర్లాకు లేఖ రాసినందున త్వరలోనే రెబల్ ఎంపీలు లోక్‌సభలో ప్రత్యేక టీఎంసీ బ్లాక్‌గా ఏర్పడే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఎన్డీయేకు మద్దతుగా...**

కాగా, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు తనతో సహా సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు మద్దతు ఇవ్వనున్నట్లు ఆ పార్టీ లోక్‌సభ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ తెలిపారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు లేఖ సమర్పించామని చెప్పారు. 'బెంగాల్ తీర్పును మేము గౌరవిస్తున్నాం. ఎన్డీయేతో కలిసే మా భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ ఉంటుందని ఆమె తెలిపారు. దీనికి ముందు 13 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీలు తొలుత సుఖేందు శేఖర్ రాయ్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. అనంత రం వీరంతా కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలుసుకున్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఢిల్లీలో భారీ ఈదురుగాలులు..

# మూడు విమానాల ధ్వంసం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానా శ్రయంలో ఆదివారం సాయంత్రం ప్రకృతి ఒక్కసారిగా ప్రకోపించింది. అకస్మాత్తుగా వీచిన బలమైన ఈదురు గాలులు, భారీ వర్షం కారణంగా విమానాశ్రయంలోని స్టెప్ లాడర్ వేగంగా విమానాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎయిర్ ఇండియాకు చెందిన మూడు నారోబాడీ (ఎయిర్‌బస్ ఏ320) విమానాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో విమానాల్లో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఆదివారం సాయం త్రం సుమారు 4:40 గంటల ప్రాంతంలో టెర్మినల్-2 సమీపంలోని విమానాల పార్కింగ్ బేల వద్ద ఈ సంఘటన జరిగింది. అంతవరకూ సాధారణంగా ఉన్న వాతావరణం నిమిషాల వ్యవధిలోనే మారిపోయింది. అకస్మాత్తుగా వీచిన భారీ గాలులు, తుపాను దాటికి ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలకు చెందిన స్టెప్స్ లాడర్ విమానాలపైకి దూసుకెళ్లింది. చూస్తుండగానే పార్క్ చేసి ఉన్న ఎయిర్‌బస్ ఏ320 విమా నాలను ఢీకొట్టింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## 'సర్'లో అనుమానిత విదేశీయులపై కన్ను!

**రాష్ట్రాల యంత్రాంగాలకు ఈసీ ఆదేశాలు**



న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాల యంత్రాంగాలకు కీలక ఆదేశాలు జారీచేసింది. సర్ ప్రక్రియ చేపట్టే సమయంలో ఎవరైనా అనుమానిత విదేశీయులను గుర్తిస్తే..అలాంటి కేసులను పౌరసత్వ చట్టం-1955 కింద పనిచేసే సంబంధిత అధికార యంత్రాంగానికి తెలియజేయాలని పేర్కొంది. ఈ విషయంలో అసిస్టెంట్ ఈఆర్వోలు ఈఆర్వో అధికారాలను స్వతంత్రంగా వినియోగించు కోవాలని స్పష్టం చేసింది. అదేవిధంగా ఎవరైనా ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగి రాకుంటే, బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు) స్థానిక ఓటర్లను విచారించడం ద్వారా అందుకు గల కారణాలను (అందుబాటులో లేకపోవడం, నివాసం మారడం,మరణించడం, డబుల్ ఎంట్రీ వంటివి) గుర్తించి, నోట్ చేయాలని పేర్కొంది. ఈ మేరకు సర్ సమయంలో అనుసరించాల్సిన విధానాలపై ఈసీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు గత నెల 14న వివరణాత్మక కీలక మార్గదర్శకాలు జారీచేసిందని వార్తా సంస్థ పీటీఐ పేర్కొంది. గతేడాది బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేకసమగ్ర సవరణ కోసం ఈసీ సన్నాహాలు చేస్తుండగా.. బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌లకు చెందిన పలువురిని క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించినట్లు ఎన్నికల అధికారులు నివేదించారు. అయితే చివరికి ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హతలేని అటువంటి వ్యక్తులకు సంబంధించిన ఎలాంటి గణాంకాలను కానీ, ఆధారాలను గానీ ఎన్నికల అధికారులు వెల్లడించలేదు. బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాలకు అనుకూలంగా లేని ఓటర్లు లక్ష్యంగా సర్ ప్రక్రియను చేపట్టేందుకు ఈసీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇటువంటి వాదన అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈసీ ఏపీ, తెలంగాణ సహా 16రాష్ట్రాలు, 3 యూటీల్లో సర్ మూడో దశను గత నెల 14న ప్రారంభించిన విషయం తెలిసిందే. మే 30నుంచి 36.73కోట్ల ఓటర్లకు సంబంధించిన ప్రక్రియను దశలవారీగా చేపట్టింది.

## నేపాల్ సరిహద్దుల్లో

# టీఎంసీ కీలక నేత అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు.గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘావర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగాల్‌లోని సౌత్ 24పరగణాల జిల్లా ఫాల్టా పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, భూఅక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనపై నమోదైన వరుసకేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18నకోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించినప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసం హరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు.





# పర్షియన్ గల్ఫ్ మళ్లీ వణుకు

## భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై డ్రోన్ దాడి




అంతర్జాతీయ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయంలో జలసంధికి సమీపంలో ఒమన్ తీరంలో ఒక సరకు రవాణా నౌకపై సోమవారం డ్రోన్ లేక క్షిపణితో దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పర్షియన్ గల్ఫ్‌లో పలావు దేశ జెండాతో వెళ్తోన్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్నప్పుడు దాడి జరిగిందని ప్రాథమికంగా తెలుస్తోంది. అప్పుడు నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. ఆ దాడితో ఇంజిన్ దెబ్బతిన్నదని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్‌ఓఎస్ కాల్ పంపినట్లు కనిపిస్తోంది. ఆ ఓడలో పలువురు గాయపడ్డారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఇండియా వెల్లడించింది. దాడిలో లైఫ్ బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు ప్రక్రియ కూడా సంక్లిష్టమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# ఫిలిప్పీన్స్‌లో భీకర భూకంపం

- **32 మంది మృతి, 200మందికి గాయాలు**
- **రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రత నమోదు, సునామీ హెచ్చరికలు**

దక్షిణ ఫిలిప్పీన్స్‌ను సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఈ భూకంపం ధాటికి మృతుల సంఖ్య 32కి పెరిగ్గా.. దాదాపు 200మంది గాయపడినట్లు సమాచారం. మరోవైపు, తీరప్రాంతంలోని పలు నగరాల్లో ఆస్తి నష్టం చోటు చేసుకొంది. ఈ భూప్రకంపనలకు జనరల్ శాంటోస్ నగరం వణికిపోయింది. ఈ నగరంలో 7 లక్షలమంది జనాభా ఉంటారు. ఇక్కడ ట్యూనా ప్రాసెసింగ్ పరిశ్రమ చాలా పెద్దది. జనరల్ శాంటోస్ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రకృతి విలయాన్ని గత కొన్ని దశాబ్దాల్లో ఫిలిప్పీన్స్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఈ భూకంపం ప్రభావానికి పలు భవనాలు కుప్పకూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. జనరల్ శాంటోస్లో పలు భవనాలు పాక్షికంగా కుప్పకూలగా.. అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం సైతం స్వల్పంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఓ ముఖ్యమైన వంతెనకు బీటలు ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం రాగానే.. ప్రభావిత తీర ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసిన అధికారులు.. తక్షణమే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.



జనరల్ శాంటోస్‌కు నైరుతి దిశగా 8 మైళ్ల దూరంలో 6.2 మైళ్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో 10 అడుగుల ఎత్తున సునామీ అలలు విరుచుకుపడొచ్చని ఫిలిప్పీన్స్ వాసులను హెచ్చరించారు. మరోవైపు ఇండోనేషియా, మలేసియాలో 3 అడుగుల ఎత్తువరకు సముద్రపు అలలు ఎగసిపడే అవకాశం ఉందని పసిఫిక్ సునామీ సెంటర్ పేర్కొంది. తైవాన్, జపాన్, పపువా న్యూ గునియా కూడా ప్రభావితం కావొచ్చని అంచనా వేశారు. ఫిలిప్పీన్స్ తీరంలో మూడు అడుగుల ఎత్తు వరకు సునామీ అలలు ఎగసిపడ్డాయి.

# ఇరాన్‌ను వెంటనే వీడండి

**- భారత రాయబార కార్యాలయం తక్షణ హెచ్చరిక**

**- పశ్చిమాసియాలో భారతీయుల భద్రతపై ఆందోళన**



ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. “ఈ ప్రాంతం (పశ్చిమాసియా)లో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్ లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం” అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

**పెట్రో కెమికల్ ప్లాంట్పై ఇజ్రాయెల్ దాడి..**

ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ప్లాంట్పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.



# ఇక చాలు ఆపేద్దాం!

**మైక్‌ను కాలితో తొక్కి వెళ్లిపోయిన ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యవహారశైలితో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బహిరంగంగా తన అసహనాన్ని వ్యక్తంచేసిన ఆయన.. మైక్ తీసి కిందపడేశారు. ఇక చాలు అంటూ బయటకు వెళ్లిపోయారు. మీట్ ది ప్రెస్ ఇంటర్వ్యూలో భాగంగా ఇరాన్ యుద్ధంపై ట్రంప్‌నకు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలు ఎక్కడివరకు వచ్చాయని హోస్ట్ అడిగారు. అలాగే గత ప్రభుత్వం అన్యాయంగా పలువురిని లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తూ.. వారికి పరిహారం ఇచ్చే ఉద్దేశంతో ప్రతిపాదించిన యాంటీ వెపనైజేషన్ స్కీమ్ను గురించి ప్రశ్నించారు. ఈ చర్చ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్, మీడియాపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. అలాగే 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ తాను చేసిన ఆరోపణలను సమర్థించుకున్నారు. అయితే వీటన్నింటికి ఆధారాలు చూపించాలంటూ హోస్ట్ క్రిస్టెన్ వెల్కర్ పదేపదే అడిగారు. దీంతో ట్రంప్ సహనం కోల్పోయారు.

“చాలా ఆధారాలున్నాయి. ఆ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. మళ్లీ ఇప్పుడు కాలిఫోర్నియాలో జరుగుతోన్న మేయర్ ఎన్నికల్లోనూ అదే జరుగుతోంది. ఓటింగ్ పూర్తయినా కౌంటింగ్ ఆలస్యమవుతుండటం ఇందుకు నిదర్శనం” అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ వల్ల ఆలస్యమవుతుండొచ్చని హోస్ట్ పేర్కొనగా.. ఆ వాదనను అధ్యక్షుడు తోసిపుచ్చారు. ఆ చర్చ తీవ్రరూపం దాల్చడంతో.. “ఇక చాలు ఆపేద్దాం. థ్యాంక్యూ” అంటూ మైక్రోఫోన్ను తీసేసి, కిందపడేశారు. ఇంటర్వ్యూను కొనసాగిద్దాం అంటూ హోస్ట్ కోరగా.. ఇప్పటికే చాలా సమయం ఇచ్చానంటూ మధ్యలోనే వెళ్లిపోయారు.

# ఇరాన్–ఇజ్రాయెల్ మళ్లి పరస్పర దాడులు

**- శాంతి చర్చలకు ముప్పు**

**- దాడులు ఆపాం.. ఇరాన్ ప్రకటన**

**- లెబనాన్ దాడులు ఆపకుంటే మళ్లీ మొదలు**

ఇజ్రాయెల్‌పై దాడులను నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తే.. తాము మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుదేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని.. శాంతి, సుస్థిరతను నెలకొల్పాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఐఆర్టీసీ ఈ ప్రకటన చేసింది. సోమవారం టెహ్రాన్పై ఇజ్రాయెల్ ప్రయోగించిన పలు డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చేశాయని వెల్లడించింది. దేశ రక్షణ కోసం ఎటువంటి ముప్పును అయినా ఎదుర్కొంటామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. దౌత్యం, రక్షణ అనేవి జాతీయ శక్తికి రెండు రెక్కల వంటివని అన్నారు. యుద్ధరంగం నుండి గానీ.. చర్చల నుంచి కానీ తాము వైదొలగలేదని వెల్లడించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. చాలా అనుమానాల మధ్య తమ అధికారులు అమెరికాతో శాంతి చర్చలు జరుపుతున్నారని.. లెబనాన్లో ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి తెలిసి జరిగినా తెలియకుండా జరిగినా వాటి వల్ల చర్చల ప్రక్రియకు అంతరాయం కలుగుతుందన్నారు. శాంతి ఒప్పందానికి దగ్గరగా ఉన్న సమయంలో ఈ దాడులు చేపట్టడం సరైన చర్య కాదన్నారు. ఇరాను వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేపట్టే ఏ చర్యకైనా అమెరికానే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా ఇరాన్ లోని ఒక పెట్రోకెమికల్ ప్లాంట్ ఆ దేశం బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడానికి వినియోగిస్తోందని ఆరోపిస్తూ.. ఇజ్రాయెల్ ఆదివారం టెహ్రాన్లోని పెట్రోకెమికల్ ప్లాంట్పై చేసింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ లోని పెట్రో కెమికల్ ప్లాంట్ ఐఆర్ జీసీ దాడి చేసింది. దీంతో ట్రంప్ ఇరుదేశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు ఆపి.. చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఇరాన్ తాజా ప్రకటన చేసింది.



# అఫ్గాన్‌పై టీమిండియా ఘన విజయం



ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు 300 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఫాలోఆన్‌లో అఫ్గానిస్థాన్ జట్టు 112 పరుగులకే కుప్పకూలింది. అయితే టెస్టుల్లో టీమిండియాకు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. ఫాలోఆన్‌లో సెదిఖుల్లా అటల్(42) టాప్ స్కోరర్. రహ్మనుల్లా గుర్బాజ్(24) పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఫాలోఆన్‌లో భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4, కుల్‌దీప్ యాదవ్ 3, మానవ్ సుతార్ 1 వికెట్ పడగొట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 564/8 వద్ద డిక్లేర్ ప్రకటించింది. కేఎల్ రాహుల్(100), శుభ్‌మన్ గిల్(126) సెంచరీలతో అదరగొట్టారు. సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్(81), వాషింగ్టన్ సుందర్(52) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. రెండో ఇన్నింగ్స్‌లో అఫ్గానిస్థాన్ 152 పరుగులకే ఆలౌటైంది. అరంగేట్రంలోనే యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 6 వికెట్లతో సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో.. అఫ్గాన్‌తో ఫాలోఆన్ ఆడించింది. ఫాలోఆన్‌లో కూడా అఫ్గాన్ బ్యాటర్లు పేలవ ప్రదర్శన కనబర్చారు. భారత బౌలర్ల ధాటికి విలవిల్లాడారు. 112 పరుగులకే ఫాలోఆన్‌లో కుప్పకూలారు. దీంతో భారత్ టెస్టు చరిత్రలోనే అతిపెద్ద విజయం సాధించింది.

## వైభవ్ ఏం చేస్తాడో..నాకైతే డౌటే!





టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే టీ20ల్లో తన రేంజ్ ఏంటో ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో ఏకంగా 776 పరుగులతో తాను చిచ్చర పిడుగు అని అనిపించుకున్నాడు. 15 ఏళ్ల చిరు ప్రాయంలోనే టీమిండియా టీ20 జట్టుకు కూడా ఎంపికై అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నాడు. వన్డేలు, టెస్టులపై కూడా తనకు ఆసక్తి ఉందని వైభవ్ ఒక సందర్భంలో చెప్పాడు. ఈ విషయమై దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అతడికి అద్భుతమైన టాలెంట్ ఉంది. కానీ రెడ్ బాల్ క్రికెట్ విషయంలో అతడు ఏం చేస్తాడో నేనైతే ఇప్పుడే చెప్పలేను. కావాలనుకుంటే అతడు ఏదైనా చేయగలడు. కానీ టెస్టులపై అతడి ఆసక్తి ఏమేరకు ఉందో తెలియదు. నాకైతే ఈ విషయంలో కొన్ని సందేహాలు ఉన్నాయి. ఇందులో కాలుపెట్టాలనుకుంటే మాత్రం కొన్ని సవాళ్లు తప్పవు. అతడు టెస్టులపై కూడా దృష్టిపెట్టాలనే కోరుకుంటున్నా. చూద్దాం ఏం జరుగుతుందో..' అని డివిలియర్స్ అన్నారు. దక్షిణాఫ్రికా అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరైన డివిలియర్స్ తను ఆడే రోజుల్లో ఎన్నో కొత్త షాట్స్‌ను కూడా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం క్రికెట్‌లో కూడా ఏఐ సాంకేతికత ప్రవేశించడంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఆడే రోజుల్లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చి ఉంటే తనకు మరింత ప్రయోజనం కలిగి ఉండేదని చెప్పారు. ఒక్కో షాట్‌లో రిస్క్ ఎంత ఉంటుందో ఏఐ ద్వారా విశ్లేషించే అవకాశం ఉండేదని చెప్పారు.

## ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ విజేత జ్వెరెవ్



అలెగ్జాండర్ జ్వెరెవ్ సాధించాడు.. తొలి గ్రాండ్‌స్లామ్ కోసం ఎన్నాళ్లుగానో వేచి చూస్తున్న ఈ జర్మనీ టెన్నిస్ స్టార్ ఎట్టకేలకు తన కల సాకారం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కారజ్, సినర్, జొకోవిచ్‌ల అడ్డు లేకుండా ఫైనల్ చేరిన ఈ వరల్డ్ నెంబర్ టూ ఆటగాడు అందివచ్చిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకుంటూ చివరకు విజేతగా నిలిచాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ రెండోసీడ్ జ్వెరెవ్ 6-1, 4-6, 6-4, 6-7(5-7), 6-1తో 10వ సీడ్ ఫ్లావియో కొబొల్లీ (ఇటలీ)పై ఐదుసెట్ల పాటు పోరాడి గెలిచాడు. 29 ఏళ్ల జ్వెరెవ్ నాలుగో ప్రయత్నంలో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ నెగ్గడం విశేషం. తొలిసారిగా 2020లో యూఎస్ ఓపెన్ ఫైనల్ చేరిన జ్వెరెవ్.. డొమినిక్ థీమ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. ఆ తర్వాత 2024లో ఫ్రెంచ్ ఓపెన్ తుదిపోరులో నిలిచినా, అల్కారజ్‌కు ట్రోఫీ కోల్పోయాడు. నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జానిక్ సినర్‌కు టైటిల్ చేజార్చు కున్న జ్వెరెవ్..ఈసారి మట్టి కోర్టులో మాత్రం పాగా వేశాడు. ఇక, 4 గంటల 16 నిమిషాలపాటు సాగిన టైటిల్ పోరు రసవత్తరంగా సాగింది. తొలి సెట్‌ను బ్రేక్ పాయింట్‌తో ఆరంభించిన జ్వెరెవ్.. పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మరో రెండుసార్లు ఫ్లావియో కొబొల్లీ సర్వీసను బ్రేక్ చేసిన జ్వెరెవ్ సెట్‌ను సొంతం చేశాడు. అయితే, రెండో సెట్‌లో ఫ్లావియో పుంజుకొన్నాడు. 3-3తో ఉన్న సమయంలో.. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన కొబొల్లీ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ సమం చేశాడు. మూడో సెట్‌లో ఇద్దరూ సర్వీస్ లను నిలబెట్టుకోగా.. 10వ గేమ్‌లో జ్వెరెవ్ బ్రేక్ పాయింట్‌తో మూడో సెట్‌లో గెలిచి 2-1తో పైచేయి సాధించాడు. కానీ, నాలుగో సెట్‌లో హోరాహోరీగా పోరాడిన కొబొల్లీ 6-6తో సెట్ ఫలితాన్ని టైబ్రేక్ తీసుకెళ్లాడు. టైబ్రేక్‌లో కొబొల్లీ 7-5తో నెగ్గి నాలుగో సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. ఇక, నిర్ణాయక ఐదో సెట్‌లో జ్వెరెవ్ జోరుతో అంతా ఏకపక్షమైంది.

## నేను రిటైర్ అవ్వాలని కోరుకుంటున్నారా?

### రిపోర్టర్‌కి కౌంటర్ ఇచ్చిన హర్మన్‌ప్రీత్!



'ఈ టీ20 ప్రపంచ కప్ మీకు చివరది అవుతుందా?' అంటూ ఓ రిపోర్టర్ హర్మన్‌ను ప్రశ్నించాడు. దీనికి సరదాగా స్పందించిన ఆమె.. 'నేను ఆడటం ఆపేయాలని మీరు అనుకుంటున్నారా?' అని ఎదురు ప్రశ్న వేసింది. దీనికి ఆ రిపోర్టర్..'అలా కాదు.. కేవలం మీ ప్రణాళికలు తెలుసుకునేందుకు ఈ ప్రశ్న అడిగా. టీ20 నుంచి వైదొలగడానికి సమయం రాలేదని మీరు భావిస్తు న్నందుకు సంతోషిస్తున్నాను' అని సమాధానమిచ్చాడు. అయినప్ప టికీ హర్మన్ తగ్గలేదు. 'మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు' అంటూ అసహనం వ్యక్తం చేసింది. హర్మన్‌ప్రీత్ సారథ్యంలో టీమిండియా ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2025ను ముద్దాడిన సంగతి తెలిసిందే. దీంతో ఈ పొట్టి ప్రపంచకప్‌లో భారత మహిళలపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ విషయంపై కూడా హర్మన్ స్పందించింది. 'వన్డే ప్రపంచ కప్ విజయంతో సహజంగానే మరిన్ని అంచనాలు వస్తాయి. కానీ మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల సంకేతంగా చూస్తున్నాను. వ్యక్తిగతంగా నేను బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. జట్టు బాగా ఆడితే చాలా విషయాలు మారుతాయి. ఈ ప్రపంచకప్‌లోనూ మా అత్యుత్తమ ఆటను ప్రదర్శించి మహిళల క్రికెట్‌పై మరింత ప్రభావం చూపాలని ఆశిస్తున్నాం' అని హర్మన్ వెల్లడించింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ జూన్ 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం జూన్ 17న టోర్నీలో అరంగేట్రం చేస్తున్న నెదర్లాండ్స్ తో తలపడుతుంది. భారత్ ఉన్న గ్రూపులో ఆస్ట్రేలియా, సౌతాఫ్రి కా, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు మాత్రమే సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

## ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌లో మార్పులివే

ప్రతిష్ఠాత్మక ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ మరో మూడ్రోజుల్లో మొదలవనుంది. ఈసారి టోర్నీ విప్లవాత్మక మార్పులతో మన ముందుకొస్తోంది. ఆటలో మరింత పోటీతత్వం పెంచడంలో భాగంగా సరికొత్త నిబంధనలను ఫిఫా రూపొందించింది. బంతి మైదానం నుంచి బయటికి వెళ్లాక ఆటగాళ్లకు దాన్ని లోపలికి విసిరేందుకు 5 సెకన్లకంటే ఎక్కువ సమయం ఉండదు. ఎవరైనా కావాలని రీస్టార్ట్‌ను ఆలస్యం చేస్తే ప్రత్యర్థి జట్టుకు త్రో-ఇన్ అవకాశం ఇస్తారు. బంతిని తన్నడానికి లేదా పాస్ చేయడానికి గోల్ కీపర్‌కు కూడా కేవలం 5 సెకన్ల సమయమే ఉంటుంది. ఆలస్యం చేస్తే ప్రత్యర్థికి వెంటనే కార్నర్ కిక్ అవకాశమిస్తారు. సైడ్‌లైన్ దగ్గర వైద్య చికిత్స తీసుకునేందుకు ఆటగాళ్లు వెళ్లి, తిరిగి రావడానికి నిమిషం సమయం తీసుకోవాల్సి ఉంటుంది. వాగ్వాద సమయాల్లో ఆటగాళ్లెవరూ తమ నోళ్లను కవర్ చేసుకుని మాట్లాడడాన్ని అనుమతించరు. ఎవరైనా అలా చేస్తే రెడ్ కార్డుకు గురవుతారు. ఈ నిబంధనను వరల్డ్‌కపనకే గాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా జరిగే అన్ని ఫుట్‌బాల్ టోర్నమెంట్లో అమలు చేయను న్నారు. ఆటలో రేసిజం కట్టడి చేయడంలో భాగంగా ఈ నిబంధనను రూపొందించారు. ఇక నుంచి ఆటగాళ్లకు ఆట ప్రథమార్ధం, ద్వితీయార్థాల్లో మూడు నిమిషాల చొప్పున హైడ్రేషన్ విరామం లభిస్తుంది.

